Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 32 సంచిక : 206 విశాఖపట్నం, 28 మే 2023 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## వైద్య సేవలపై ఉన్నతాధికారుల సమీక్ష



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిడిఎంఎ, జిల్లా ప్రత్యేక అధికారి పి. కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన 4వ జోన్, 34వ వార్డు కొబ్బరితోట వద్ద పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మతో కలిసి సందర్శించారు. హాస్పటలలో గల మౌలిక వసతుల వివరాలను డిఏంఓహెచ్ ను అడిగి తెలుసుకున్నారు. హాస్పటలకు ప్రతి రోజు ఎంతమంది పేషెంట్లు వస్తున్నారని, పడకలు ఎన్ని ఉన్నాయి.., మందుల వివరాలు, చికిత్స అందించే విధానం, ఎంతమంది వైద్యులు, ఇతర ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో తాగునీటి కొరకు ఆర్ ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం 33వ (మిగతా 2లో)

## నీతి ఆయోగ్‌తో భేటీకి కేసీఆర్ సహా ఏడుగురు సీఎంలు దూరం



జాతీయ స్థాయిలో పలు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఇవాళ ప్రధాని మోడీ ఢిల్లీలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ పాలకమండలి భేటీ ప్రారంభమైంది. అయితే ఈ భేటీకి ఏడుగురు ముఖ్యమంత్రులు రాకుండ్ల దూరంగా ఉండిపోయారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు కేంద్రంతో సఖ్యతగా ఉంటున్న బీజేపీ, కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, నవీన్ పట్నాయక్ మాత్రమే హాజరయ్యారు.

నీతి ఆయోగ్ భేటీకి దూరంగా ఉండిపోయిన ముఖ్యమంత్రుల్లో తెలంగాణ సీఎం కేసీఆర్, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, రాజస్తాన్, ఛత్తీస్ ఘడ్, కర్నాటక ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భూపేష్ భగేల్, సిద్ధరామయ్య, కేరళ సీఎం పినరయి విజయన్, బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఉన్నారు. అలాగే హాజరైన వారిలో బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు కాని వారిలో ఏపీ సీఎం వైఎస్ జగన్, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ఉన్నారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి (మిగతా 2లో)

## ఫేజ్ 1 ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేస్తాం : చంద్రబాబు



వచ్చే ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ అప్పుడే సన్నద్ధమవుతోంది. ఎన్నికలకు సంబంధించి ఫేజ్ 1 మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. రాజమండ్రిలో జరుగుతున్న మహానాడులో ప్రసంగిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. ఎన్నికలు 2024లో వచ్చినా, అంతకు ముందే వచ్చినా సైకిల్ రెడీగా ఉందని అన్నారు. గత నాలుగేళ్లగా వైసీపీ ప్రభుత్వం ఎంతో వేధిస్తున్నా టీడీపీ కార్యకర్తలు భయపడలేదని, వెనుకంజ వేయలేదని ప్రశంసించారు.

దిశ చట్టమే లేకపోయినా రాజమండ్రిలో దిశ పోలీస్ స్టేషన్ ను ప్రారంభించారని సీఎం జగన్ పై చంద్రబాబు మండిపడ్డారు. అమ్మఒడి అనేది నాటకమని, నాన్నబుడ్డీ వాస్తవమని ఎద్దేవా చేశారు. జగన్ అక్రమాల గురించి చెప్పుకోవాలంటే ఎన్నో మహానాడులు అవసరమవుతాయని అన్నారు. జలజీవన్ మిషన్ లో మన రాష్ట్రం 18వ స్థానంలో, ఆత్మహత్యల్లో 3వ స్థానంలో, అప్పుల్లో తొలి స్థానంలో, విదేశీ పెట్టుబడుల్లో 14వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులన్నీ సహాయ నిరాకరణ చేశాయని అన్నారు. తిరుమలలో కూడా గంజాయి వ్యాపారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎక్కడో ఉండే అమూల్ ను ఇక్కడకు తెచ్చాడు మన అమూల్ బేబి జగన్ అని చంద్రబాబు ఎద్దేవా చేశారు. స్కాంలు (మిగతా 2లో)

## ఈనెల 31 వరకు అవినాశ్‌కు స్వేచ్ఛ

ఎంపీ అవినాశ్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. అవినాశ్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటీషన్ పైన తెలంగాణ హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. అవినాశ్ సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబట్టారు. లోప భూయిష్టంగా ఉందని వాదించారు. సునీత తరపు న్యాయవాది అవినాశ్ దాఖలు చేసిన బెయిల్ పిటీషన్ ను కొట్టి వేయాలని కోరారు. ఈ సమయంలో సీబీఐ తన వాదనలు వినిపించింది. అనేక అంశాలను ప్రస్తావించింది. కోర్టు కూడా పలు ప్రశ్నలు సంధించింది. ఈ నెల 31న తుది తీర్పు ఇస్తామని పేర్కొన్న న్యాయమూర్తి..అప్పటి వరకు అవినాశ్ పైన చర్యలు తీసుకోవద్దని సీబీఐకి ఆదేశాలు ఇచ్చింది.






హైకోర్టులో సుదీర్ఘ విచారణ : వైఎస్ వివేకా కేసులో రెండో రోజుల హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. అవినాశ్ తరపు న్యాయవాది దాదాపు అయిదు గంటల సేపు కేసు పూర్వపరాలను వివరించారు. సీబీఐ దర్యాప్తు లోప భూయిష్టంగా ఉందని వాదించారు.

ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం కౌంటర్ లోని అంశాల ఆధారంగా నిందితుడని ముద్ర వేస్తున్నారని వివరించారు. వివేకా హత్య జరిగిన రోజున జమ్మల మడుగు వెళ్తున్న సమయంలో అవినాశ్ కు సమాచారం వచ్చిందని కోర్టుకు నివేదించారు. ఆ తరువాత సునీత తరపు న్యాయవాది అవినాశ్ తీరు పైన అభ్యంతరం వ్యక్తం చేసింది. పిటీషన్ కొట్టి వేయాలని కోరింది. శనివారం (మిగతా 2లో)

## బ్రాహ్మణ పాత్రికేయుల కుశలం అడిగిన జీవీఎల్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రిక నూతన సంపాదకులుగా టి.శిరీష శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పలువురు పాత్రికేయ మిత్రులు విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రిక కార్యాలయానికి విచ్చేసి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను ఆశీర్వదించడానికి రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు కూడా విచ్చేశారు. సంపాదకుడిగా ఇప్పటి వరకు 33 ఏళ్ల పాటు పదవీ బాధ్యతలు నిర్వర్తించిన సూరంపూడి వీరభద్రరావు ఇకపై ప్రత్యేక ప్రతినిధిగా కొనసాగుతారని, తాను జర్నలిజంలో సుమారు 15 ఏళ్లపాటు తన తండ్రి వీరభద్రరావు వద్దనే శిక్షణ పొందానని నూతన సంపాదకులు శిరీష తెలిపారు. జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశానని, సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెంచుకున్నానని, విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికను ఆత్మ విశ్వాసంతో ముందుకు తీసుకువెళ్లేందుకు బాధ్యతలు స్వీకరించానని శిరీష తెలిపారు.

పలువురు సీనియర్ పాత్రికేయులు సూరంపూడి వీరభద్రరావును, వారి కుమార్తె శ్రీమతి తటవర్తి శిరీషను అభినందిస్తూ విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రికతో తమకు గల అనుబంధాన్ని చర్చించుకున్నారు. ఈ సమావేశానికి ప్రత్యేకంగా హాజరైన రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు బ్రాహ్మణ పాత్రికేయులతో మాట్లాడుతూ సుమారు 15 మంది బ్రాహ్మణ పాత్రికేయులు విశాఖ సమాచారమ్‌పై అభిమానంతో ఇక్కడకు రావడం, నూతన సంపాదకురాలిని అభినందించడం ఆనందంగా ఉందని అన్నారు. యువతరాన్ని ప్రోత్సహించాలని, జర్నలిజంలో ఆమెకు అందరూ సహకరించాలని కోరారు.

జర్నలిస్టుల సామాజిక మరియు వ్యక్తిగత స్థితిగతులను తెలుసుకున్న ఆయన స్థిరమైన రూపంలో ఆదాయం లేని జర్నలిస్టులు అందుకు సరైన మార్గాలను ఎంచుకోవాలని కోరారు. జర్నలిజానికి కులం లేదని, కానీ బ్రాహ్మణ యువకులు జర్నలిజంలో రాణించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. యువతులు కూడా సాంప్రదాయపు కట్టుబాట్ల పేరుతో ఇంటికి పరిమితమైపోకుండా సమాజ విలువలను కాపాడడానికి పాత్రికేయ రంగంలో ప్రవేశించాలని సూచించారు. ధైర్యం, నీతి, నిజాయితీ, నిబద్ధత, కష్టించి పనిచేసే స్వభావం కలవారు పాత్రికేయ రంగంలో తప్పక విజయం సాధిస్తారని, అటువంటి వారికి తాను ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, తాను కూడా అనేక పత్రికలకు వ్యాసకర్తనని, విశ్లేషణాత్మక ఆలోచనా విధానాలే జర్నలిస్టులను మేధావులుగా చేస్తాయని ఆయన అన్నారు. బ్రాహ్మణ జర్నలిస్టులు వివిధ యాజమాన్యాల వద్ద ఉద్యోగాలు కోల్పోయి సరైన అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు కొందరు మిత్రులు ఆయన దృష్టికి తీసుకురాగా, సరైన స్వయం ఉపాధి లేదా వ్యాపారం ఎంచుకొని ముద్రా రుణాల ద్వారా ఆర్థిక సహకారం పొంది చక్కటి ఆదాయ మార్గం ఏర్పాటు చేసుకోవలసిందిగా ఆయన సూచించారు. ఈ విషయంలో ఏవైనా ఇబ్బందులెదురైతే తాను సహకరిస్తానని ఆయన తెలిపారు.

## కొత్త పార్లమెంట్ భవనంపై వీడియో విడుదల చేసిన ప్రధాని

న్యూఢిల్లీ: భారత కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైన వేళ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆ భవనానికి సంబంధించిన ఒక అద్భుతమైన వీడియోను ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. ఈ చారిత్రక భవనాన్ని మే 28న ప్రధాని మోడీ ప్రారంభించనున్న విషయం తెలిసిందే. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునాతన హంగులతో కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఈ భవన నిర్మాణం పూర్తయింది.

మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఈ నూతన పార్లమెంటుకు సంబంధించిన వీడియోను ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. నూతన పార్లమెంట్ భవనం భారతీయ పౌరులందరూ గర్వించేలా ఉంటుందని పేర్కొంటూ myparliament mypride హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. ఈ భవనంలోని సమావేశ మందిరాలు, లోపల ఏర్పాటు చేసిన ప్రత్యేక చిహ్నాలు, ఆధునాతన హంగులు ఆకట్టుకునేలా ఉన్నాయి.

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మే 28వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ నూతన పార్లమెంట్‌ను ప్రారంభించనున్నారు. రెండు దశలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉండనుంది. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

మే 28న ప్రధాని నరేంద్ర మోడీ కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించనుండగా.. ఉదయం ఏడు గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ వేడుక హవన్, పూజతో ప్రారంభమమై, ప్రధాని మోడీ ప్రసంగంతో ముగుస్తుంది.

అయితే, దేశంలోని పవర్ కారిడార్ అయిన సెంట్రల్ విస్టా పునరాభివృద్ధిలో భాగమైన కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం వివాదాస్పదమైంది. 20 ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని నిర్ణయించుకున్నాయి. టీడీపీ, బీజేడీ, మాయావతికి చెందిన బీఎస్పీ సహా దాదాపు 17 పార్టీలు ఈ వేడుకకు హాజరు కానున్నాయి.



(మొదటి పేజీ తరువాయిలు)

## వైద్య సేవలపై ఉన్నతాధికారుల సమీక్ష

వార్డు వెంకటేశ్వర మెట్ట సచివాలయం నెంబర్ 218ని సందర్శించి కార్యదర్శుల హాజరు, మూమెంట్ రిజిస్టర్, డైరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను స్థాపించి ప్రజలకు దగ్గరగా సేవలు అందిస్తున్నారని, అటువంటి సచివాలయ వ్యవస్థను నిర్వర్యం చేయకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సచివాలయ పరిధిలో ఎంత మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారని, వాలంటీర్ల పోస్టులు ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని ఆరా తీశారు. సర్వీస్ రిక్వెస్టు ఆలసత్వం వహించకుండా నిర్ణీత సమయానికే పరిష్కరించాలని, ప్రతి నెల వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానం, డోర్ టు డోర్ చెత్త సేకరించే విధానం, సర్వీస్ ఛార్జీలు వివరాలను కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, వర్మ, డాక్టర్ వి సన్యాసిరావు, డిఎంఓహెచ్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎన్ కిషోర్, డిపిఓ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### నీతి ఆయోగ్‌తో భేటీకి కేసీఆర్ సహా ఏడుగురు సీఎంలు దూరం

అశోక్ గెహ్లాట్ అనారోగ్య కారణాలతో హాజరు కావడం లేదని సమాచారమిచ్చారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆయన గైర్హాజరుకు కారణాలు చెప్పలేదు. కేంద్రంపై ఢిల్లీపై జారీ చేసిన ఆర్డినెన్స్ ను కారణంగా చూపుతూ సీఎం కేజ్రివాల్ రాలేనని చెప్పేశారు. పంజాబ్ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని, అందుకే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు సీఎం భగవంత్ మాన్ కేంద్రానికి లేఖ రాశారు.

బీజేపీయేతర ముఖ్యమంత్రులు సమావేశాన్ని బహిష్కరిస్తున్నారంటే కేంద్రం వారి పట్ల సరైన రీతిలో వ్యవహరించడం లేదని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. కేంద్రాన్ని ఎవరు పట్టించుకోకపోయినా నీతి ఆయోగ్ తమ డిమాండ్లను వినడం లేదని ఆయన అన్నారు. మరోవైపు నీతి ఆయోగ్ చైర్మన్‌గా ప్రధాని మోదీ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మోదీ సీఎంలతో చర్చిస్తారు.

### ఫేజ్ 1 ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేస్తాం : చంద్రబాబు

చేయడంలో జగన్ ది మాస్టర్ మైండ్ అని అన్నారు. ప్రజలను సర్వనాశనం చేయడానికే జగన్ వచ్చాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రూ. 2 వేల నోట్లు ఎక్కడా కనిపించడం లేదని... అన్ని నోట్లు జగన్ దగ్గరే ఉన్నాయని తెలిపారు. పబ్లిక్, ప్రభుత్వం, ప్రైవేట్, పార్టనర్ షిప్ అనే పీ4 విధానంతో పేద వాడిని ధనికుడిని చేసేందుకు నాంది పలుకుదామని చంద్రబాబు అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మనం ప్రారంభించిన పనుల వలన దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా నిలిచిందని... ఏపీలో విధ్వంసకర పాలన వలన చివర స్థానంలో ఉంటున్నామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని అన్నారు. వైసీపీ పాలనలో కౌరవ సభగా మారిన అసెంబ్లీని మళ్లీ గౌరవ సభగా మారుద్దామని చెప్పారు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం నాయకులు ప్రజలందరితో అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు.

### ఈనెల 31 వరకు అవినాశ్‌కు స్వేచ్ఛ

ఉదయం నుంచి సీబీఐ తమ వాదనలు వినిపించింది.

కోర్టు పలు ప్రశ్నలు : సీబీఐ దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా కోర్టు పలు ప్రశ్నలు సంధించింది. హత్యకు వెనుక ప్రధాన ఉద్దేశాలు ఏంటని ప్రశ్నించింది. దీని పైన సీబీఐ కీలక అంశాలను ప్రస్తావించింది. వైఎస్ వివేకా ఎమ్మెల్సీ ఓటమి వెనక కారణాలు ఉన్నాయన్నారు. అవినాశ్ కు ఎంపీ సీటు అనధికారికంగా ముందే ఖరారైందనే విషయాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. అవినాశ్ బలమైన నేత అయినప్పుడు వివేకా ను హత్య చేయాల్సిన అవసరం ఎంటని ప్రశ్నించారు.

ఎర్ర గంగిరెడ్డి, శివ శంకర్ రెడ్డి సహకారంతో ఈ ఘటన జరిగిందని సీబీఐ ఆరోపించింది. విచారణలో అవినాశ్ తమకు సహకరించటం లేదని..ఏదో కారణంతో విచారణ వాయిదా వేస్తున్నారని కోర్టుకు వివరించారు. హత్యకు నెల రోజుల ముందే ప్రణాళిక సిద్ధం చేసారని సీబీఐ తరపు న్యాయవాదులు చెప్పుకొచ్చారు.

సీబీఐకి ఆదేశాలు : రాకీయంగా వివేకా పైన పై చేయి సాధించేందుకే అవినాశ్ భావించారని సీబీఐ పేర్కొంది. సీబీఐ వాదనల సమయంలో కోర్టు నుంచి ఎదురైన ప్రశ్నలకు సీబీఐ సరిగ్గా సమాధానం చెప్పలేకపోయిందని తెలుస్తోంది. వాదనలు పూర్తి కావటంతో ఈ నెల 31న బుధవారం తీర్పు ఇస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఈ సమయంలో జోక్యం చేసుకున్న అవినాశ్ తరపు న్యాయవాది అప్పటి వరకు సీబీఐ చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అవినాశ్ తల్లి ఆస్పత్రిలో ఉండటంతో..అవినాశ్ కు తల్లి బాధ్యతలు ఉన్నాయని నివేదించారు. దీనికి అనుగుణంగా న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అందులో 31వ తేదీ వరకు అవినాశ్ పైన ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు సీబీఐని ఆదేశించింది. కొద్ది రోజులుగా సీబీఐ అరెస్ట్ పైన ఒత్తిడితో ఉన్న అవినాశ్ కు ఇది పెద్ద రిలీఫ్ గా మారనుంది.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

# మహిళల్ని వేధింపుల నుంచి రక్షిస్తున్న దిశ యాప్

ఏపీలో మహిళల్ని వేధింపుల నుంచి, ఇతరత్రా ఇబ్బందుల నుంచి రక్షించేందుకు వైసీపీ సర్కార్ తీసుకొచ్చిన దిశ యాప్ ఇప్పుడు వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోంది. దిశ యాప్ ద్వారా ప్రభుత్వం ఇప్పటికే వందల సంఖ్యలో మహిళల్ని క్షణాల్లో రక్షిస్తున్న ఉదంతాలు సర్వత్రా కనిపిస్తున్నాయి. తాజాగా దిశ యాప్ ద్వారా మహిళలపై వేధింపులకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షిస్తున్న ఉదంతాలు కూడా పెరుగుతున్నాయి.

తాజాగా కృష్ణాజిల్లా గుడివాడలో లోన్ యాప్ వేధింపుల నుండి తనకు రక్షణ కల్పించాలని బాధితురాలు దిశ పోలీసులను ఆశ్రయించింది. గుడివాడ లోని దానియాలపేట లో నివాసం వుండే ఓ మహిళ ఈ నెల 13 వ తేదీన "మై లోన్ యాప్" నుండి 7,500 రూపాయలు అత్యవసర పరిస్థితుల్లో తీసుకుంది. వారం రోజుల వ్యవధిలోనే అంటే 19వ తేదీన తీసుకున్న అప్పును వడ్డీతో సహా మొత్తం చెల్లించింది. రెండు రోజులుగా గుర్తుతెలియని వ్యక్తి తనకు కాల్ చేసి వేదిస్తున్నట్లు బాధితురాలు దిశకు ఫిర్యాదు చేసింది. వివిధ ఫోన్ నంబర్ల నుండి ఆగంతకుడు కాల్ చేసి అదనంగా డబ్బులు కట్టాలని వేదిస్తున్నట్లు పోలీసులకు తెలిపింది. దీంతో రంగంలోకి దిగిన దిశ పోలీసులు బాధితురాలికి ఇంటికెళ్లి భరోసా కల్పించారు.

అలాగే కాకినాడ సర్పవరం లోని పోస్టల్ కాలనీ లో వీరబాబు అనే వ్యక్తి తనను ప్రేమ పేరుతో వేదిస్తున్నట్లు బాధితురాలు దిశ SOS కు కాల్ చేసింది. వెంటనే అలెర్ట్ అయిన దిశ టీం కానిస్టేబుల్, హోం గార్డ్ లను సంఘటనా స్థలానికి పంపించింది. కేవలం 5 నిముషాల వ్యవధిలో బాధితురాలి లోకేషన్ కు దిశ పోలీసులు చేరుకున్నారు. పోలీసుల రాకను కనిపెట్టిన వీరబాబు సంఘటనా స్థలం నుండి పారిపోయాడు.

సర్పవరానికి చెందిన వీరబాబు గత కొన్ని రోజులుగా ప్రేమ పేరుతో తన వెంట పడుతున్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. గత రాత్రి వీరబాబు తన ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ గొడవ పెట్టుకున్నట్లు పేర్కొంది. అడ్డువెళ్లిన తన తండ్రిని తీవ్రంగా కొట్టి గాయపరిచినట్లు చెప్పింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు వీరబాబుపై కఠిన చర్యలు తీసుకుంటామని దిశ పోలీసులు పేర్కొన్నారు.

# కుల ధృవీకరణకు రూ.1300 అనధికార వసూళ్లు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** కుల ధృవీకరణ సర్టిఫికట్ల జారీలో కాకినాడ అర్బన్ తహశీల్దారు కార్యాలయ సిబ్బంది విద్యార్థులకు, సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. అనధికారికంగా రూ.1000 నుంచి రూ.1300 వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇందుకు కొన్ని ఈ సేవా సెంటర్లతో అంతర్గత ఒప్పందం పెట్టుకుని, ఆ సెంటర్ల ద్వారా సొమ్ము చేసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. మరికొన్ని ఈ సేవా సెంటర్ల పట్ల వివక్షతతో వ్యవహరిస్తూ దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక విద్యార్థికి చెందిన కుల ధృవీకరణ పత్రం జారీ చేయడంలో 50 రోజులు జాప్యం ఈ ఆరోపణలకు బలం చేకూర్చుతోంది.ఇదిలా ఉండగా కాకినాడ శాంతినగర్‌లోని ఒక ఈ సేవా సెంటర్‌లో దరఖాస్తున్న చేసుకున్న దరఖాస్తుదారులకు మరుసటి రోజునే కుల ధృవీకరణతో పాటు ఆదాయ ధృవీకరణ పత్రం అందించినట్లు సమాచారం. అయితే ఆ సెంటర్లో సంబంధిత దరఖాస్తుదారులు రూ.1300 చెల్లించినట్టు తెలిసింది. అదే విధంగా కాకినాడ మరికొన్న ఈ సేవా సెంటర్ల ద్వారా ఈ తహశీల్దారు కార్యాలయ సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం.వారు నిర్దేశించుకున్న సెంటర్లు మినహా, ఇతర ఈ సేవా సెంటర్ల ద్వారా వచ్చే దరఖాస్తులను పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.కాకినాడ గొడారిగుంటకు చెందిన మరో విద్యార్థి, సమీపంలోని ఈ సేవా సెంటరు ద్వారా ఏప్రిల్ 5న దరఖాస్తు చేసుకోగా 50 రోజుల పాటు జాప్యం చేశారు.దరఖాస్తు చేసుకున్న 7 రోజులలో ఆదాయ ధృవీకరణ పత్రం జారీ చేసిన తహశీల్దారు కార్యాలయ సిబ్బంది,కుల దృవీరణ పత్రాన్ని జారీ చేయకపోవటం పలు సందేహాలకు తావిస్తోంది.ఈ సేవా సెంటర్లలో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు యూజర్ చార్జీలు చెల్లించినప్పటికీ ఈ సేవా సెంటర్ల నిర్వాహకుల పట్ల వివక్షతతో దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నట్టు పలువురు బాధితులు వాపోతున్నారు.50 రోజులు గడిచినప్పటికీ కుల ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడంలో జాప్యం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూర్చుతోంది.

జూన్ 12 నుంచి పాఠశాలలు తెరువనున్న నేపద్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాలను నమర్పించాల్సి ఉంటుంది.అంతే కాకుండా జూనియర్ కళాశాలలు,ఇతర పోటీ పరీక్షలు,డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం సంబంధిత మండల తహశీల్దారు జారీ చేసిన కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు ఆవశ్యకత చాలా ఉంటుంది.ఈ నేపద్యాన్ని కాకినాడ అర్బన్ తహశీల్దారు కార్యాలయ సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పర్యావసానంగా సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ధృవీకరణ పత్రాల జాప్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి,తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

# హెచ్-1 బీ వీసాపై విదేశీ హెల్త్ వర్కర్లకు చాన్స్




అగ్రరాజ్యం అమెరికాలో హెచ్-1బీ వీసా విషయంలో ఇటీవల కాలంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హెచ్-1బీ వీసాపై విదేశీ హెల్త్ వర్కర్స్కు అవకాశం కల్పించే బిల్లు చట్టసభకు చేరింది. ఇద్దరు యుఎస్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ బిల్లును బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. దేశంలో తగినంత మంది హెల్త్ వర్కర్లు లేనప్పుడు హెచ్1 బీ వీసా ద్వారా విదేశాల నుంచి రప్పించుకునే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ సభ్యురాలు రషీదా త్లైబ్ డాలియా రామిరేజ్ ప్రవేశపెట్టిన బిల్లుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వెటరన్స్ కోసం విస్తరించే ఆరోగ్య సంరక్షణ చట్టం హెచ్-1 బీ వీసా హోల్డర్లుగా ఉన్న వలస ఆరోగ్య కార్యకర్తలను అనుమతించడం ద్వారా అమెరికాలో హెల్త్కేర్ ప్రొవైడర్ల కొరతను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఈ బిల్లు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ ప్రయోజనాల కోసం డిపార్ట్మెంట్ ఆఫ్ వెటరన్స్ అఫైర్స్ స్టేట్ వెటరన్స్ హోమ్లను మినహాయింపు సంస్థలుగా నిర్దేశిస్తుంది.

"మన దేశంలో ఆరోగ్య కార్యకర్తల కొరతతో బాధపడుతున్న వారి పట్ల మా నిబద్ధతను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాకు ఉంది. మా కమ్యూనిటీలలోని వలసదారులతో మేము ఈ కొరతను పరిష్కరించగలం పనిచేయడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారు. కానీ వీసా కారణంగా చాలా అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. " అని వెటరన్స్ వ్యవహారాలపై హౌస్ కమిటీ సభ్యురాలు కాంగ్రెస్ సభ్యురాలు రామిరేజ్ అన్నారు.

మరో ప్రజా ప్రతినిధి త్లైబ్ జోక్యంతో ఈ బిల్లు రూపొందించినట్లు కాంగ్రెస్ ఉమెన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. "మా అనుభవజ్ఞులు అధిక-నాణ్యత గల ఆరోగ్య సంరక్షణకు అర్హులు. మా జిల్లాకు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం అనుభవజ్ఞులు చాలా అవసరం" అని కాంగ్రెస్ మహిళ త్లైబ్ అన్నారు.

"మా అనుభవజ్ఞుల కోసం ఆరోగ్య సంరక్షణ ప్రదాతలను విస్తరించడానికి ఈ చట్టాన్ని పరిచయం చేస్తున్నందుకు నేను గర్వపడుతున్నాను వలస వచ్చిన వారి సంరక్షణ కోసం ఆరోగ్య సంరక్షణ నిపుణులను స్వాగతించడం ద్వారా వారి సేవలు పొందే అవకాశం ఉంటుంది" అని ఆమె చెప్పారు. ఈ చట్టాన్ని ది వెటరన్స్ ఫర్ పీస్ సేవ్ అవర్ %వారా% నేషనల్ ప్రాజెక్ట్ ది అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ఆమోదించాయి.

# రెండేళ్ల చిన్నారికి జీవితఖైదు వేసిన కిమ్

ఆధునిక ప్రపంచంలోనూ ఆటవిక పాలన సాగించే దేశాధినేతలు పలువురు ఉన్నారు. ఏ జన్మలోనో ఘోరమైన పాపం చేసినోళ్లకు దేవుడు శిక్ష విధించి.. ఆయా దేశాల్లో పుట్టిస్తాడా? అన్న భావన కలుగక మానదు. 21వ శతాబ్దంలో సాటి మనిషిని జంతువు కంటే హీనంగా చూసే దారుణ పరిస్థితుల్ని చూస్తే నోట మాట రాదు.

అరాచకానికి పరాకాష్ఠ అన్నట్లుగా వ్యవహరించే దేశాధినేతల జాబితాలో ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మొదటి మూడు స్థానాల్లో ఉంటారు. అతడి పాలనలో వేసే శిక్షలు వింతగా. .విచిత్రంగా.. నోటి వెంట మాట రాని రీతిలో ఉంటాయి.

చిన్న కారణాలకే ప్రాణాలు తీయటం.. కిమ్ పోలిన హెయిర్ కట్ కు ప్రాణాల్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితులు ఉండటం తెలిసిందే. అలాంటి ఉత్తరకొరియాలో తాజాగా వెల్లడైన నివేదికను చూస్తే.. ఆ దేశంలో దారుణాలు ఎంతలా ఉంటాయన్న దానికి నిదర్శనంగా కొన్ని ఉదంతాలు బయటకు వచ్చి ప్రపంచాన్ని నిశ్చేష్టులయ్యేలా చేస్తోంది.

రెండేళ్ల వయసు అంటే.. ఎలా ఉంటుంది? మాటలు సైతం సరిగా రాని వేళలో.. ఏది మంచి? ఏది చెడు అనే విచక్షణ అన్నది లేని వయసులో.. వేసిన ఒక అనాగరిక శిక్ష షాకింగ్ గా మారింది.

అంతర్జాతీయ మతస్వేచ్ఛ 2022 పేరుతో అమెరికా విదేశాంగ శాఖ ఒక రిపోర్టును విడుదల చేసింది. ఇందులో ఉత్తర కొరియా అధినేత కిమ్.. ఇతర మతాల వారి పట్ల ఎంత దారుణంగా వ్యవహరిస్తుందన్న విషయాన్ని ప్రస్తావించారు.

ఇప్పుడా దేశంలో 70 వేల మంది క్రైస్తవులను ఖైదు చేయగా.. అందులో రెండేళ్ల చిన్నారి ఉండటం గమనార్హం. ఆ చిన్నారికి జీవిత ఖైదు విధిస్తూ కిమ్ నిర్ణయం తీసుకున్నారు. ఇంతకూ ఆమెకు అంతటి తీవ్రమైన శిక్షను ఎందుకు వేశారంటే.. ఆమె కుటుంబం మత గ్రంధాన్ని కలిగి ఉండటం.. మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనటగా చెబుతున్నారు. 2009లో ఆ చిన్నారి కుటుంబాన్ని అరెస్టు చేశారని.. ఆ సమయంలో రెండేళ్ల చిన్నారికి కూడా జీవిత ఖైదు విధించిన వైనం బయటకు వచ్చింది. ఇతర మతాల వారిని అరెస్టు చేసి.. వారికి జైలుశిక్షను విధించిన జైళ్లలో పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నట్లుగా చెబుతున్నారు. వారిని శారీరకంగా హింసించటం.. జీవించే హక్కుల్ని రిజెక్టు చేయటంతోపాటు.. లైంగిక వేధింపులకు పాల్పడటం లాంటివి కూడా చేస్తారని పేర్కొన్నారు. కిమ్ రాజ్యంలో మత స్వేచ్ఛను కోరుకునే వారిని తీవ్రంగా వేధించటం ఆ దేశంలో మామూలేనని నివేదికక స్పష్టం చేసింది.ఈ వివరాలు ఇప్పుడు సంచలనంగా మారాయి.

పంచాంగం

ఆదివారం 28-05-2022
శోభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం గ్రీష్మరుతువు
జ్యేష్ట మాసం

తిథి : శు. అష్టమి ఉ. 6.9

నక్షత్రం : పుబ్బ రా. 11.54 వ.

వర్జ్యం : ఉ. 06.21 ల 09.57

## మహానాడుకు గాజువాక నుండి భారీగా కార్యకర్తలు




**గాజువాక, (విశాఖ సమాచారమ్):** రెండు రోజులపాటు రాజమహేంద్రవరంలో జరగబోయే తెలుగుదేశం పసుపు పండుగ మహానాడుకు పెద్ద ఎత్తున టిడిపి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు గాజువాక నుండి బస్సులో బయలుదేరేందుకు రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) 87వ వార్డ్ పార్టీ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, సెక్రటరీ సత్తి బాబు, జిల్లా కార్యదర్శి కళ్లేపల్లి. శ్రీనివాసవర్మ, సూరిశెట్టి పెంటారావు.డీవీ.అప్పారావు, ప్రగడ దానయ్య,రమణమూర్తి, జీవీ. రమణ,శిరసపల్లి అప్పలరాజు. పోతల కృష్ణ సిహెచ్. నూకరాజు,గండేపల్లి రాము, కాకా రామకృష్ణ.సాయి వర్మ,కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్నిమాంబ ఉత్సవంలో భారీగా అన్నదానం



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** శ్రీ యెర్నిమాంబ అమ్మవారి విశాఖపట్నంజిల్లా మరియు నగరము జ్ఞానపురం నందు వేంచేసియున్న శ్రీ యెర్నిమాంబ అమ్మవారి దేవస్థానం యొక్క శ్రీ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవములు ప్రతీ సంవత్సరము వలె తేదీ:20.05.2023 నుండీ తేదీ:21.05.2023 ఆదివారం వరకూ ఉత్సవము అత్యంత వైభవముగా జరిగింది.

శ్రీ అమ్మవారి జాతర సందర్భంగా తేదీ 27.05.2023 మధ్యాహ్నం 12.00గంటల నుండి సుమారు 5000మంది భక్తులకు భారీ గా అన్నదానం కార్యక్రమం విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా జరిగింది.

ఈ కార్యక్రమం నకు జిల్లా ఎండోమెంట్ అధికారిణి కె. శిరీష, ఆలయ కార్యనిర్వాహనాధికారి డి. వి. యస్. సురేష్ బాబా, వైస్సార్సీపీ నాయకులు వేళంగిని రావు, మౌళి, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మహానాడులో చంద్రబాబు ఉపన్యాసం అంతా ఆత్మస్తుతి, పరనిందలా సాగింది: పేర్ని నాని

టీడీపీ మహానాడులో చంద్రబాబు ప్రసంగంపై వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని స్పందించారు. మహానాడులో చంద్రబాబు ఉపన్యాసం అంతా ఆత్మస్తుతి, పరనిందలా సాగిందని విమర్శించారు. అధికారం కోసం తప్పుడు మాటలు మాట్లాడే వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు.

సంపద గురించి చెబుతున్న చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు శ్రీకాకుళం నుంచి తడ వరకు ఏమి సంపద సృష్టించారని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి అప్పులు తప్ప ఒరిగిందేమీ లేదని అన్నారు. వయసు పైబడిన లక్షణాలు చంద్రబాబులో కనపడుతున్నాయని, టీడీపీ కార్యకర్తలకు సుత్తి మాటలు చెబుతున్నాడని వ్యాఖ్యానించారు.

అసలు, సైకిల్ గుర్తు సృష్టికర్త ఎవరు... అని పేర్ని నాని నిలదీశారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు చంద్రబాబు హస్తం పార్టీ నీడలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. సైకిల్ కు కరెంటు పెడితే దూసుకుని పోతుందని చంద్రబాబు అంటున్నాడని, ఎప్పటికైనా సైకిల్, మోటార్ సైకిల్ ఒకటి అవుతాయా? అని వ్యంగ్యం ప్రదర్శించారు. ఇది ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు దొంగిలించిన సైకిల్ అని పేర్ని నాని విమర్శించారు.

సీఎం జగన్ దేశంలోనే ధనిక ముఖ్యమంత్రి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దేశంలోనే అత్యంత ధనికుడైన రాజకీయ నాయకుడు అని తెలిపారు. చంద్రబాబుకు ఆయన తండ్రి ఖర్జూరనాయుడు ఇచ్చిన ఆస్తి ఎంత? అని ప్రశ్నించారు. రెండు ఎకరాల నుంచి రూ.1000 కోట్ల ఆస్తి ఎలా సంపాదించావ్? అంటూ చంద్రబాబును ప్రశ్నించారు.

చంద్రబాబు ఎన్నికల అఫిడవిట్ చూసినా, కుటుంబ సభ్యుల ఆదాయపన్ను రికార్డులు చూసినా ఆయనెంత సంపన్నుడో తెలిసిపోతుందని పేర్ని నాని అన్నారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని ముక్కలు చేసిన శకుని... ఎన్టీఆర్ ను కూలదోసేందుకు రామోజీరావుతో కలిసి కుట్రలు పన్నారు అంటూ విమర్శించారు.

# విశాఖ సమాచారమ్

ఆదివారం 28-05-2023


## అగ్ని పరీక్ష విజేతగా ఆదానీ

హిండెన్ బర్గ్ ఆరోపించినట్లు ఆదానీ గ్రూపు విషయంలో ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదు!

సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ విచారణ చేసి తమ రిపోర్ట్ ని సుప్రీం కోర్టుకి సమర్పించింది !

ఆదానీ గ్రూపు మీద వచ్చిన ఆరోపణల మీద నిజాలు తెలుసుకోవడానికి సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ సభ్యులు :

1.రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జ్ ఎ.ఎం. సప్రె

2. రిటైర్డ్ బాంబే హై కోర్టు జడ్జ్ జె.వి. దేవధర్

3. మాజీ స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా శ్రీ ఓ.పి భట్

4. మాజీ ఐసీఐసీఐ బ్యాంక్ చీఫ్ కె.వి. కామత్

5. ఇన్ఫోసిస్ కొ ఫౌండర్ శ్రీ నందన్ నీలేకని

6. సోమశేఖర్ సుందరేశన్- సెక్యూరిటీస్ & రెగ్యులేటరీ నిపుణుడు

పైన పేర్కొన్న కమిటీ అన్ని రికార్డులు పరిశీలించి సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది.

1. ఆదానీ గ్రూపుకి సంబంధించి ఎలాంటి కృత్రిమ ట్రేడింగ్ జరగలేదు.

2. ఆదానీ గ్రూపుకి సంబంధించి ఎలాంటి అధికార దుర్వినియోగం జరగలేదు.

3. ఆదానీ గ్రూపుకి సంబంధించి ఎలాంటి మినిమం పబ్లిక్ షేర్ హెూల్డింగ్స్ లో నియమ నిబంధనల ఉల్లంఘనలు జరగలేదు. రెగ్యులేటరీ కి సంబంధించిన అన్ని నియమ నిబంధనలని గౌరవవిస్తూ ఆదానీ గ్రూపు తగిన చర్యలు తీసుకుంది. ఈ విషయంలో మాకు ఎలాంటి అవకతవకలు జరిగినట్లు కనపడలేదు.

4. కమిటీ కి ఎలాంటి నియమ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు కనపడలేదు కాబట్టి ఆదానీ గ్రూపుని చట్ట పరంగా విచారించే ఎలాంటి అంశము లేనందున చట్టపరమయిన విచారణ అవసరం లేదు.

5. హిడెనబర్గ్ రిపోర్ట్ రేపు వస్తుంది అనగా కొన్ని విదేశీ సంస్థలు లాభాలకి తమ షేర్లని అమ్ముకున్నట్లుగా రికార్డ్ అయి ఉన్నట్లు మేము గమనించాము ! ఈ సంస్థలు అన్నీ కూడా షార్ట్ ట్రేడింగ్ చేస్తున్నవే అని మేము గమనించాము.

6. ఆదానీ గ్రూపు కి ఇచ్చిన రుణాలు అన్నీ చట్టపరంగా నిబంధనల ప్రకారమే ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకి తావు లేదు.

7. విదేశీ పోర్ట్ ఫోలియో సంస్థలు ఆదానీ గ్రూపులో పెట్టిన పెట్టుబడులు అన్నీ SEBI నిబంధనల మేరకు పెట్టుబడి పెట్టినవే ఉన్నాయి కానీ ఎలాంటి చట్ట పరమయిన ఉల్లంఘనలు జరగలేదు.

8. ఇప్పటివరకు సుప్రీం కోర్టు నియమించిన విచారణ కమిటీ కి ఎలాంటి ప్రాథమిక సాక్ష్యధారాలు దొరకలేదు.

9. కానీ SEBI తన విచారణని ఇంకా కొనసాగిస్తూ ఉండడం వలన సుప్రీం కోర్టు SEBIకి ఆగస్ట్ 14 వరకు గడువు ఇచ్చింది తన రిపోర్ట్ ని సుప్రీం కోర్టుకి ఇవ్వడానికి !

పైన పేర్కొన్న కమిటీ సభ్యులలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు అయిన నందన్ నీలేకని పక్కా బిజెపి వ్యతిరేకి మరియు కాంగ్రెస్ హయాంలో ఆధార్ కార్డుల కి రూపకల్పన చేసిన వ్యక్తి !

ఇక స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా మాజీ ఛైర్మన్ అయిన OP భట్ కూడా బిజేపి వ్యతిరేకి !

ఇక ఆదానీ అంటూ నోరు పారేసుకునే వాళ్ళు ఇక ముందు ఎలాంటి వాగుడు చేయకుండా ఉంటే మంచింది లేకపోతే భవిష్యత్తులో కోర్టు ధిక్కారణ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలు చేసినా!

హిండెన్బర్గ్ రిపోర్ట్ ఆరోపణల మీద ప్రధాని శ్రీ నరేంద్ర మోడీజీ సుప్రీం కోర్టుని విచారించమని అభ్యర్థించారు!

ప్రధాని అభ్యర్థన మీద సుప్రీం కోర్టు కమిటీని వేసింది విచారణ చేయమని !

## స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పై సమీక్ష నిర్వహించిన జివిఎంసి కమిషనర్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖ నగరానికి మెరుగైన స్థానం పొందేటట్లు కావలసిన ఏర్పాట్లపై దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో 2023 కు సంబంధించిన స్వచ్ఛ సర్వేక్షణ్ యొక్క సర్వే బృందం త్వరలో నగరంలో పర్యటిస్తున్నందున, జివిఎంసి యంత్రాంగం సంసిద్ధం కావాలని, గత సంవత్సరం కంటే స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖ నగరానికి మెరుగైన స్థానం పొందేలా దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రజల్లో స్వచ్ఛ సర్వేక్షణపై అవగాహన కల్పించాలని, ప్రతి ఇంట్లో తడి చెత్త నుండి సేంద్రియ ఎరువు తయారు చేసే విధంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడును ఆదేశించారు. అలాగే ప్రజా, సామాజిక మరుగుదొడ్లలో అన్ని సదుపాయాలు ఉండే విధంగా చూడాలని ప్రధాని ఇంజనీర్ ను ఆదేశించారు. ప్రతి ఇంట్లో శతశాతం వ్యర్థాలను విభజించి జివిఎంసి వాహనాలకు అందించేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జివిఎంసి చేపడుతున్న అభివృద్ధి పనులు, అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినూత్నమైన ఆకారాలతో వస్తువులను తయారు చేసి పలు పార్కులలో ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ తో బిటి రోడ్లను వేయుటకు పలు రోడ్లను గుర్తించాలని ప్రధాన ఇంజనీరును కమీషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీరు రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడు, డిడిహెచ్ దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్, డిపిఓ చంద్రిక, ఎపిఆర్ఓ నాగేశ్వర రావు, సి ఓ సి, ఎస్ బి ఎం, పీఎంయు బృందాలు తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ఇ-టెండరు ప్రకటన నెం. ETCECONIVSKP 2023023, తేది. 17.05.2023

**పని పేరు:** విశాఖపట్నం కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ యొక్క విశాఖపట్నం వద్దనున్న రైల్వే ఆస్తులు (కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్) అనగా సర్వీసు భవనములు హార్టీకల్చర్ పనులు వగైరాతోసహా ప్రస్తుతమున్న కట్టడములు/ భవనములు యొక్క రిపేర్లు, మార్పులు మరియు అప్ కీపింగ్ నిర్వర్తించుట.

**సుమారు పని విలువ:** ₹77.68 లక్షలు, బయానా: ₹1,55,400/-, పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 08.06.2023న 1200 గంటలకు

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

ఇ-టెండరు డాక్యుమెంట్లుతోపాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in ఈ టెండరునకు ఏదైనా మార్పులు / సవరణ జారీ చేయబడినదేమో తెలుసుకోనుటకు టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందు వెబ్‌సైట్ మరొకసారి చూడవలసినదిగా టెండరుదారులను కోరుచున్నాము. టెండరు దారులు/బిడ్డర్లు క్లాస్-III డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి మరియు IREPS పోర్టల్ నందు తప్పక నమోదు చేసుకుని ఉండాలి. రిజిస్టర్డ్ టెండరుదారు / బిడ్డరు మాత్రమే ఇ-టెండరింగ్ నందు పాల్గొనవలెను.

టెండరుదారులు యొక్క అన్ని సూచనలను టెండరుదారులు జాగ్రత్తగా చదవాలి మరియు జతపరచిన టెండరు డాక్యుమెంట్లు యొక్క చాప్టర్-2 టెండరు ఫారం (రెండవ షీటు) పట్టిక-I పేరా 3.1 (అదనపు చెక్ లిస్టు) చెక్ లిస్టులుతోపాటే అన్ని సూచనలు సమ్మతించినట్లు నిర్ధారించాలి. పట్టిక-B సక్రమంగా పరిశీలించి మరియు చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం చేసినది దాఖలు చేయాలి.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (Con) భువనేశ్వర్

PR-27/CG/23-24


## వుడా కాలనీలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**గాజువాక, (విశాఖ సమాచారమ్):** గాజువాక జోన్ పరిధి వుడా కాలనీ డబల్ రోడ్డు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా రాఘవరెడ్డి హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో, ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు భక్తులకు పాదచార్లకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నరసింగ రావు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా రాఘవరెడ్డి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారని అన్నారు. వేసవికాలంలో ఎంతో మంది దాహం తీరుస్తున్న సంస్థ ప్రతినిధి సురేష్ రెడ్డిని అభినందించారు . ఒకరోజు మజ్జిగకు అయ్యే ఖర్చు తన తరపున ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జాగారపు శ్రీను ,జిలకర భువనేశ్వరి, గూటూరు. శంకరరావు, రాజ శేఖర్ ,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుని ఆలయానికి మంత్రి కారుమూరి విరాళం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 12వ వార్డు, తోట గరువు లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణుని ఆలయం ను శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమురి నాగేశ్వర రావు సందర్శించారు. ఆలయం అభివృద్ధి కి తన వంతు ఆర్థిక సహాయంగా ఒక లక్ష యాభై వేల రూపాయలను ఆలయ కమిటీ కి అందించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ , రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్, వంశీ యువసేన అధ్యక్షులు ధూళి రఘు, స్థానిక గ్రామ సంఘ నాయకులు ఒమ్మి అప్పలరాజు , ఒమ్మి కృష్ణ , మొల్లి జగ్గారావు గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభయ హస్తం పెన్షన్ కు 22 మంది ఎంపిక



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** కొగుంట గ్రామపంచాయతీలో అభయ హస్తం పెన్షనుకు సుమారు 22 మంది ఎంపిక అయినట్లు సర్పంచ్ దాసరి కుమారి వరహాలు అన్నారు. మండలంలో కవగుంట గ్రామపంచాయతీలో అభయహస్తం కట్టుకున్న డ్వాక్రా మహిళలందరితో శనివారం సర్పంచ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా అక్కచెల్లెమ్మలందరిని లక్షాధికారులను చేయాలన్న ఉద్దేశంతో, అలాగే పెన్షన్లు కూడా డ్వాక్రా మహిళలకు అందించాలన్న లక్ష్యంతో అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంలో 60 సంవత్సరాలు నిండిన మహిళలకు 500 రూపాయలు ప్రతినెల పెన్షన్ అందించే సౌలభ్యం కల్పించారన్నారు. అయితే ఈ పథకం గత ప్రభుత్వంలో పూర్తిగా మరుగున పడడంతో అభయ హస్తం పెన్షన్ లబ్ధిదారులందరూ దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అయితే రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని వారి తనయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి ఏ లక్ష్యంతో అయితే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారో ఆ దిశగా అడుగులు వేయాలన్న ఉద్దేశంతో అభయ హస్తం కట్టి 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 500 పెన్షన్ ఇవ్వడం, అలాగే మధ్యలో ఆగిపోయిన వారికి తిరిగి పెన్షన్ ఇవ్వాలన్న నిబంధన ప్రభుత్వం తీసుకురావడంతో ఆ దిశగా అనేకమంది పెన్షన్ పొందే అవకాశం ఉందన్నారు. అలాగే కవగుంట గ్రామపంచాయతీలో 23 డ్వాక్రా సంఘాలకు గాను సుమారు పది సంఘాలలో సుమారు 120 మంది చేరడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే ఆరుగురు అభయహస్తం పెన్షన్ పొందుతూ ఉన్నారు .దీంతో ప్రస్తుతం ఈ పథకానికి అర్హత పొందిన లబ్ధిదారులు జగ్గపు పైడితల్లమ్మ, బిళ్ళపాటి రత్నం, బర్నికానా అప్పలకొండ ,తురాయి రాజమ్మ, రబ్బా సత్యమమ్మ ,సిద్ధ దేవుడమ్మ, నడిపెల్లి కాంతమ్మ , చంద్రాన పార్వతమ్మ, చీపురుపల్లి నాగరాజు, పల్లా రాజమ్మ, చీపురుపల్లి నాగరాజు, తదితర సుమారు 22 మంది ఈ పథకంలో పెన్షనుకు అర్హత కలిగి ఉన్నారన్నారు. వీరు సామాజిక వృద్ధాప్య, వితంతు, వికలాంగ, పెన్షన్లు పొందుతున్నప్పటికీ వీటితోపాటు అభయ హస్తం పెన్షన్ కూడా 500 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇవన్నీ చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వీరందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు . ఇది ఇలా ఉండగా అభయహస్తం పెన్షన్ ప్రీమియం కొనసాగించుకోవడానికి ఇష్టం లేనివారు తిరిగి ఆ సొమ్మును తీసుకునే సౌలభ్యం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు.

దీనికి సంబంధించి వెలుగు కార్యాలయ సిబ్బందికి ప్రతి గ్రామంలోనూ సర్వే నిర్వహించి అర్హత కలిగిన పెన్షన్ దారులు అందరికీ పెన్షన్ ఇవ్వాలని, ఈ పథకంలో కొనసాగడానికి ఇష్టం లేని వారందరి కి తిరిగి సొమ్ము చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో చాలా దూర దృష్టితో ఆలోచన చేసి డ్వాక్రా అక్క చెల్లెమ్మలను మోసం చేయడానికి వీలులేదని తండ్రి పెట్టిన పథకాన్ని సైతం కొనసాగించాలని వారందరికీ పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు.దీనికి అధికార యంత్రాంగం కూడా పారదర్శకంగా పెంక్షన్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ కల్పించాలని దానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపాలని తెలిపారు . ఈ పథకాన్ని లబ్ధిదారులందరూ సక్రమమైన పద్ధతిలో సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

## హాస్టల్ విద్యార్థులను టాపర్స్‌గా తయారు చేయండి: కలెక్టర్



**విజయనగరం:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులను టాపర్స్‌గా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. హాస్టల్ విద్యార్థులంతా వచ్చే సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, దీనికోసం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే తగిన ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, ఎస్‌సి, బిసి, ఎస్‌టి, దివ్యాంగ సంక్షేమ వసతి గృహాలు, జ్యోతిభా పూలే బిసి గురుకులాలు, అంబేద్కర్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాష్టర్లు, స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వారి హాస్టళ్లు, పాఠశాలల పరిస్థితి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఇటీవల కాలంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని అన్నారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఈ మార్పులు పరీక్షా ఫలితాల్లో కూడా కనిపించాలని, ప్రయివేటు విద్యాసంస్థలను తలదన్నే విధంగా, ప్రతీ సంక్షేమ వసతిగృహంలో టెన్త్, ఇంటర్ శతశాతం ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఈ మేరకు తగిన ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులు, అవగాహనా స్థాయి తక్కువ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు విద్యతోపాటు, వారి ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలని, రక్తహీనత ఉన్నవారికి అవసరమైన పోషకాహారం, మందులను అందించాలన్నారు. కౌమార బాలికలకు వివిధ అంశాలపట్ల అవగాహన కల్పించాలన్నారు. కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక అంశాలు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, దానికి పదును పెట్టేందుకు కృషి చేయాలని, వ్యక్తిత్వ వికాశంపై దృష్టి పెట్టాలని కోరారు.

విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహారం విషతుల్యం కావడం, ఆహారంలో నాణ్యతాలోపం, లేక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా అస్వస్థతకు గురైనా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల విషయంలో నిర్లిప్తత పనికిరాదని, ప్రతిరోజూ అప్రమత్తంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. భోజన నాణ్యతను పరిశీలించేందుకు ప్రతీ విద్యాసంస్థలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదులు ఉన్న కాంట్రాక్టర్లను తొలగించి, నాణ్యమైన సరుకులను సరఫరా చేసే వారికే కాంట్రాక్టులు కేటాయించాలని ఆదేశించారు. త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతుందని, ఆరోజు నాటికి అన్ని వసతి గృహాలు, సంక్షేమ పాఠశాలలు పరిపూర్ణంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. సంక్షేమాధికారులు, ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు వ్యక్తిగతంగా ప్రతీది పరిశీలించి, సిద్ధం చేయాలని సూచించారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, విద్యుత్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించి, సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డిఇఓ లింగేశ్వరరెడ్డి, సాంఘిక సంక్షేమాధికారి పివి రత్నం, జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయాధికారి చంద్రావతి, ఇతర శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ యాజమాన్యాల విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇకపై వేగవంతంగా పనులకు బిల్లుల చెల్లింపులు



**విజయనగరం:** ఉపాధిహామీ కన్వెర్జెన్స్, గడపగడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల కింద మంజూరైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపును వేగవంతం చేస్తోందని అందువల్ల ఈ కార్యక్రమాల కింద చేపట్టిన పనులను రికార్డు చేయడం, బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితర ప్రక్రియ తక్షణం పూర్తిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే నాలుగు నెలల కాలంలో ఈ కార్యక్రమాల కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులో సమస్యలు ఉండబోవని, అందువల్ల జిల్లాలో చేపట్టిన పనులన్నీ పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఇంజనీరింగ్ పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ కన్వర్జెన్స్ నిధులతో చేపట్టిన పనులను ఇకపై ప్రతివారం రికార్డుచేసి, శనివారం నాటికి ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ పనులను నమోదు చేయడం, బిల్లులను అప్‌లోడ్ చేయడం వంటి అంశాల్లో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు. జిల్లాలో ఫస్ట్ సిగ్నెటరీ కింద అప్‌లోడ్ చేసిన రూ.38 కోట్లు, రెండో సిగ్నటరీ కింద అప్‌లోడ్ చేసిన బిల్లులు మరో రూ.12 కోట్లు పెండింగ్‌లో వున్నాయని వాటిని త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సూచించారు. ఈ పనులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి గాని, జిల్లా కలెక్టర్ దృష్టికి గాని ఇంజనీరింగ్ అధికారులు తీసుకువస్తే పరిష్కరిస్తామని మంత్రి స్పష్టంచేశారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాలో మంజూరైన పనులన్నీ వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. మునిసిపల్ ప్రాంతాలు, విద్యుత్ ప్రాంత పంపిణీ సంస్థకు సంబంధించిన పనులకు నిధులు మంజూరు కాలేదని సిపిఓ బాలాజీ తెలిపారు. విద్యుత్ పనులకు సంబంధించి ఇపిడిసిఎల్ సి.ఎం.డి. పృథ్వీతేజతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తున్నందున ముందస్తుగా నిధుల కోసం కోరకుండా మంజూరైన పనులు వెంటనే చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ విషయమై రాష్ట్ర స్థాయిలో అధికారులతో మాట్లాడతామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో పనులు చేపట్టేందుకు అవసరమైన సిమెంటు కోసం పనులు చేపట్టేవారితో డి.డి.లు తీయించాలని చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులకు బిల్లుల చెల్లింపుపై కూడా మంత్రి సమీక్షించారు. దీనిపై రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడారు. జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కింద 1055 పనులు మంజూరు చేయగా 858 ప్రారంభించడం జరిగిందని పంచాయతీరాజ్ ఎస్.ఇ. గుప్తా వివరించారు. 83 బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు.

ఉపాధిహామీ, గడపగడపకు మనప్రభుత్వం కింద చేపట్టిన పనులు ఎలా జరుగుతున్నాయో తరచుగా మండలాల్లో పర్యవేక్షించాలని డిపిఓ శ్రీధర్‌రాజా, జిల్లాపరిషత్ డిప్యూటీ సి.ఇ.ఓ. రాజ్‌కుమార్‌లను మంత్రి ఆదేశించారు.

జిల్లాలో ధాన్యం సేకరణ పరిస్థితిపై మంత్రి పౌరసరఫరాల అధికారులు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తో చర్చించారు. రబీ సీజనులో జిల్లాలో పెద్దగా లక్ష్యాలేమీ నిర్దేశించలేదని జె.సి. పేర్కొన్నారు.

**ఉపాధి హామీలో మొదటి స్థానంలో నిలిచినందుకు అభినందన**

ఉపాధిహామీ పనుల్లో జిల్లా జాతీయ స్థాయిలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని మంత్రి పేర్కొంటూ అధికారులను అభినందించారు. ఉపాధి పనుల్లో మన జిల్లా ప్రతిఏటా ఉత్తమ పనితీరును కనబరుస్తోందని, అదే పంథాను కొనసాగిస్తూ ఈ ఏడాది జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు.

ఈ సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సిపిఓ బాలాజీ, పంచాయతీరాజ్ ఎస్.ఇ. గుప్తా, గ్రామీణనీటి సరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్, ఇపిడిసిఎల్ ఎస్.ఇ. నాగేశ్వరరావు, డ్వామా పి.డి. ఉమాపరమేశ్వరి, మునిసిపల్ సహాయ కమిషనర్ ప్రసాదరావు, మునిసిపల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మీనాకుమారి, డి.ఎస్.ఓ. మధుసూదనరావు, డిప్యూటీ సిఇఓ రాజ్‌కుమార్, డిపిఓ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

# కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం



సిట్రస్ ఆధారిత వస్తువులపై మక్కువ ఉన్నవారికి, లెమన్ వొర్బానా మొక్క ఖచ్చితంగా హిట్ అవుతుంది. లెమన్ వొర్బానా చిన్న నిమ్మకాయలా కనిపిస్తుంది. దీని ఆకులు నిగనిగలాడే ఆకుపచ్చ రంగులో ఉంటాయి. మరియు దాని ఆకులు తీపి మరియు అదే సమయంలో నిమ్మ వాసన. కాబట్టి వాటిని పానీయాలు, సలాడ్లు, జెల్లీలు, ఉడకబెట్టిన పులుసులు, సూప్‌లు, చేపలు మరియు మాంసాలకు కలుపుతారు.

కొన్నిసార్లు, నిమ్మకాయకు బదులుగా నిమ్మకాయ సువాసన కలిగిన నిమ్మకాయ వెర్బెనా మొక్క యొక్క ఆకులను ఆహారంలో కలుపుతారు. ఈ ఆకులను ఆహారంలో సువాసన కోసమే కాకుండా వాటిలో ఉండే పోషకాల కోసం కూడా కలుపుతారు.

1. అలసిపోయిన కండరాలను నయం చేస్తుంది లెమన్ వొర్బానాలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి న్యూట్రోఫిల్స్ అనే తెల్ల రక్తకణాలను ఆక్సీకరణం వల్ల దెబ్బతినకుండా నిరోధిస్తాయి. ఇది మన రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. మనం రోజూ వ్యాయామాలు చేసినప్పుడు, ఆ వ్యాయామాలు పూర్తి చేసిన తర్వాత మన కండరాలు నొప్పులుగా ఉంటాయి. మనం చాలా తేలికగా కదలలేము. ఈ సమస్యను పరిష్కరించడానికి లెమన్ వొర్బానా సహాయం చేస్తుంది. లెమన్ వొర్బానాలో సారం నుండి సేకరించిన యాంటీఆక్సిడెంట్ ఇన్హిబిటర్లపై ఒక అధ్యయనం నిర్వహించబడింది. ఆరోగ్యకరమైన పురుష వాలంటీర్లు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. లెమన్ వొర్బానా రసం తాగిన తర్వాత 3 వారాల పాటు 90 నిమిషాల పరుగు చేయాలని కోరారు. వారు పరిగెత్తినప్పుడు, వారి యాంటీఆక్సిడెంట్ ఎంజైమ్ కార్యకలాపాలు, ఆక్సీకరణ ఒత్తిడి గుర్తులు, తాపజనక లేదా అలెర్జీ సైటోకిన్‌లు మరియు కండరాల నష్టం నిశితంగా పరిశీలించబడ్డాయి. ఈ అధ్యయనం ముగింపులో, లెమన్ వొర్బానా సారంలోని యాంటీఆక్సిడెంట్ ఇన్హిబిటర్లు ఎక్కువ దూరం పరుగెత్తడం వల్ల కండరాలకు కలిగే నష్టాన్ని తగ్గించి, కండరాల పుండ్లు ఏర్పడకుండా నివారిస్తాయని కనుగొనబడింది. మరియు లెమన్ వెర్బెనా సారం వ్యాయామం చేయడానికి మన శరీరం యొక్క సెల్యులార్ అనుసరణలను నిరోధించకుండా ఈ ప్రభావాన్ని చేసిందని కనుగొనబడింది. దీనితో, లెమన్ వొర్బానా సారం వ్యాయామానికి అనుగుణంగా ఉంటుంది మరియు శరీరానికి హాని కలిగించకుండా కండరాలను బలపరుస్తుంది, కండరాల నొప్పిని తగ్గిస్తుంది.

2. కీళ్ల నొప్పుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది వయసు పెరిగేకొద్దీ కీళ్లపై అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. నిమ్మకాయ వెర్బెనా కీళ్లను బలంగా మరియు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుందని ఒక అధ్యయనం సూచిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే నిమ్మకాయ జ్యూస్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ (ఫిష్ ఆయిల్)ని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల మన కీళ్లను ఆరోగ్యంగా ఉంచవచ్చని ఒక అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలో, కీళ్ల నొప్పులు మరియు అసౌకర్యంతో బాధపడుతున్న 45 మంది రోగులు పాల్గొన్నారు. వారిలో కొందరు 9 వారాల పాటు లెమన్ వొర్బానా రసాన్ని సప్లిమెంట్‌గా తీసుకున్నారు. ఇతరులు దీనిని ప్లేసిబోగా తీసుకున్నారు. ఈ అధ్యయనం ముగింపులో, లెమన్ వొర్బేనా సారాన్ని డైటరీ సప్లిమెంట్‌గా తీసుకున్న వారికి కీళ్ల నొప్పులు గణనీయంగా తగ్గాయని మరియు వారి శరీర బరువు పెరుగుతుందని కనుగొనబడింది, అయితే లెమన్ వొర్బానా ప్లేసిబోగా తీసుకున్న వారు అలా చేయలేదు. మరియు ఈ అధ్యయనం ప్రారంభించిన 3 నుండి 4 వారాలలో ఈ సానుకూల ప్రభావం సంభవించిందని కనుగొంది. అయితే, లెమన్ వొర్బానాను మన ప్రధాన భోజనానికి ప్రత్యామ్నాయంగా తీసుకుంటే మరియు పూర్తి ప్రయోజనాలను పొందవచ్చో తెలుసుకోవడానికి మరిన్ని పరిశోధనలు జరగాలి.

3. స్టాఫ్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది చర్మంపై దద్దుర్లు, వికారం, వాంతులు, అతిసారం, నిర్జలీకరణం, తక్కువ రక్తపోటు మరియు కొన్ని తీవ్రమైన అనారోగ్యాలు స్టాఫ్ ఇన్ఫెక్షన్ వల్ల సంభవించవచ్చు. యాంటీబయాటిక్ నిరోధకతను ఎదుర్కోవడం కొంచెం కష్టం. అయితే, వాటిని సహజంగా నయం చేయడం చాలా ముఖ్యం. లెమన్ వొర్బెనానుండి సేకరించిన ఇథనాల్ వివిధ రకాల క్లినికల్ లాబొరేటరీ అధ్యయనాలలో స్టెఫిలోకాకస్ ఆరియస్ పెరుగుదలను నిరోధిస్తుంది. స్టాఫ్‌తో చర్మవ్యాధులు ఉన్న జంతువులలో ఇటీవలి అధ్యయనం నిర్వహించబడింది. అధ్యయనానికి గురైన జంతువులను 4 గ్రూపులుగా విభజించారు. వారికి 7 రోజుల పాటు ఎటువంటి చికిత్స అందించబడలేదు, లెమన్ వెర్బెనా సారం నుండి తీసిన ఇథనాల్‌తో తయారు చేసిన లేపనం వారి చర్మానికి పూయబడింది లేదా నిమ్మకాయ వెర్బెనా సారంతో ఇంజెక్ట్ చేయబడింది. ఆ తరువాత, జంతువులలో చర్మవ్యాధి యొక్క వైద్యం రేటు మరియు చర్మ వ్యాధిలో చీము అధ్యయనం చేయబడ్డాయి. అధ్యయనం ముగింపులో, లెమన్ వెర్బెనా నుండి సేకరించిన లేపనం విజయవంతంగా పని చేసి, దాని ప్రారంభ దశలో స్టెఫిలోకాకస్ ఆరియస్ పెరుగుదలను నిలిపివేసినట్లు కనుగొనబడింది. ఆ తరువాత, జంతువులలో చర్మవ్యాధి యొక్క వైద్యం రేటు మరియు చర్మ వ్యాధిలో చీము అధ్యయనం చేయబడ్డాయి. అధ్యయనం ముగింపులో, నిమ్మకాయ వెర్బెనా నుండి సేకరించిన లేపనం విజయవంతంగా పని చేసి, దాని ప్రారంభ దశలో స్టెఫిలోకాకస్ ఆరియస్ పెరు గుదలను నిలిపివేసినట్లు కనుగొనబడింది.

4. మల్టిపుల్ స్క్లెరోసిస్ నివారిస్తుంది మల్టిపుల్ స్క్లెరోసిస్ దృష్టి నష్టం, నొప్పి, అలసట, బలహీనమైన సమన్వయం మరియు ఇతర లక్షణాలను కలిగిస్తుంది. అయితే, వారి ప్రభావం వ్యక్తి నుండి వ్యక్తికి మారుతూ ఉంటుంది. గట్టి చర్మ వ్యాధుల విషయంలో, శరీరంలో వాపు లేదా అలెర్జీలు సంభవిస్తాయి. కానీ లెమన్ వోబెనా ఈ సమస్యను పరిష్కరిస్తుంది. 2014లో వెన్నుపాము పక్షవాతంతో బాధపడుతున్న 30 మందిపై ఒక అధ్యయనం జరిగింది. వారికి సప్లిమెంట్‌గా యాంటీఆక్సిడెంట్ అధికంగా ఉండే లెమన్ వొర్బానా జ్యూస్ ఇవ్వబడింది. ఈ అధ్యయనం ముగింపులో, సెకండరీ వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్న చాలా మంది రోగులు నిమ్మకాయ సారాన్ని సప్లిమెంట్‌గా తీసుకున్నారని వారి సి యాంటీబాడీ ప్రోటీన్ స్థాయిలలో తగ్గుదల ఉందని కనుగొనబడింది. కాలేయం మరియు వాపులో ఉత్పత్తి చేయబడిన సి-రియాక్టివ్ ప్రోటీన్ కోసం రక్త పరీక్షల ఆధారంగా, వెన్నుపాము వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులలో వాపు మరియు అలెర్జీలను తగ్గించడానికి పరిశోధకులు నిమ్మకాయ వెర్బెనాను చూపించారు.

5. ఊబకాయాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది 2016 సర్వే ప్రకారం 18 ఏళ్లు పైబడిన దాదాపు 1.9 మిలియన్ల మంది అధిక బరువుతో ఉన్నారు. అధిక బరువు మధుమేహం, గుండె జబ్బులు మరియు క్యాన్సర్‌కు దారి తీస్తుంది. కాబట్టి శరీర బరువును సమతుల్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. నిమ్మకాయ వెర్బెనా ఊబకాయాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తదుపరి అధ్యయనం సూచిస్తుంది. జంతువులతో ఒక అధ్యయనం నిర్వహించబడింది. స్థూలకాయంతో సంబంధం ఉన్న జీవక్రియ సమస్యలను మెరుగుపరిచేందుకు నిమ్మకాయ వెర్బెనాలో ఉండే యాంటీఆక్సిడెంట్ ఇన్హిబిటర్ల సామర్థ్యం ప్రత్యేకంగా ఫాస్ఫోలిపిడ్‌లకు సంబంధించి పరిశీలించబడింది. చివరగా, లెమన్ వెర్బెనా నుండి తీసిన సారం శరీరంలో ట్రైగ్లిజరైడ్ ఏర్పడకుండా నిరోధిస్తుందని, మంటను తగ్గించిందని మరియు ఆక్సీకరణ ఒత్తిడికి వ్యతిరేకంగా పోరాడుతుందని పరిశోధకులు కనుగొన్నారు. మొత్తంమీద నిమ్మకాయ వొర్బేనా వోబుస్కోసైడ్ కంటే మెరుగ్గా పనిచేస్తుందని కనుగొన్నారు.

చివరగా 2017లో 54 మంది అధిక బరువు గల మహిళలతో ఒక క్లినికల్ అధ్యయనం నిర్వహించబడింది. వివిధ రకాల మందార (మందార సబ్దరిఫా) మరియు నిమ్మకాయ వోబ్బెనా (అలోసియా ట్రిఫిల్లా) వారికి సప్లిమెంట్‌లుగా ఇవ్వబడ్డాయి మరియు వాటి ప్రభావాలను పర్యవేక్షించారు. చివరగా, ఒక నెల తర్వాత, ప్రతిరోజూ 500 గ్రాముల నిమ్మకాయ మరియు మందారను సప్లిమెంట్‌గా ఇచ్చిన మహిళలకు కడుపు నిండుగా మరియు అదే సమయంలో ఆకలి తక్కువగా ఉన్నట్లు కనుగొనబడింది. కానీ వీటిని ప్లేసిబోగా తీసుకున్న వారు ఈ ప్రభావాలను అనుభవించలేదని కూడా కనుగొనబడింది. కాలక్రమేణా ఈ వ్యత్యాసం పెరిగినట్లు కూడా కనుగొనబడింది.

# పుట్టగొడుగులతో డిప్రెషన్‌కు చెక్ !



పుట్టగొడుగులు.. వీటినే మష్రూమ్స్ అని కూడా అంటాం. ఇవి వెజిటేరియన్స్‌కు.. నాన్‌వెజ్ అనే చెప్పుకోవచ్చు. శాఖాహారులకు ప్రొటీన్ అందించే సూపర్ ఫుడ్ అని చెప్పుకోవచ్చు. ఎన్నో ఎళ్లుగా పుట్టుగొడుగులను ఆహారంగానూ, ఔషదాల్లోనూ ఉపయోగిస్తున్నారు. పుట్టగొడుగు మన డైట్‌లో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. మష్రూమ్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్-బి1, బి2, బి9, బి12, విటమిన్-సి, విటమిన్-డి2 ఉంటాయి. పుట్ట గొడుగుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచేందుకు సహాయపడతాయి. ఇవి క్యాన్సర్ రాకుండా, శరీల అవయవాల్లో ఇన్ఫ్లమేషన్ తగ్గించేందుకు తోడ్పడతాయి.

ప్రముఖ పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా మన డైట్‌లో పుట్టగొడుగలను చేర్చుకోవాలని సిఫార్సు చేశారు. పుట్టగొడుగులు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను.. ఇన్‌స్టా పోస్ట్‌లో షేర్ చేశారు. మష్రూమ్స్‌లో ఫ్యాట్ ఉండదు, సోడియం తక్కువగా ఉంటుంది, కేలరీలు తక్కువగా ఉంటాయి, కొలెస్ట్రాల్ ఉండవు, అలాగే ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి అని లవ్‌నీత్ బాత్రా అన్నారు. వర్షాకాలంలో మష్రూమ్స్ మన ఆహారంలో చేర్చుకుంటే.. వ్యాధులు, ఇన్ఫెక్షన్స్ దరిచేరవని అన్నారు.

**గుండెకు మంచిది..** మష్రూమ్స్ మన డైట్‌లో చేర్చుకుంటే.. గుండె ఆరోగ్యానికి మంచిదని పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా అన్నారు. వీటిలో సోడియం తక్కువగా, పొటాషియం మెండుగా ఉంటుంది. పుట్టగొడుగులు తింటే.. శరీరంలో సోడియం స్థాయులు కంట్రోల్‌లో ఉంటాయి. హైపర్‌టెన్షన్‌తో బాధపడేవారు పుట్టగొడుగులు తినాలని లవ్‌నీత్ బాత్రా సూచించారు.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది..** పుట్టగొడుగులలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియకు తోడ్పడుతుంది. పుట్టగొడుగులలో ఉండే.. ఒలిగోశాకరైడ్‌లు పేగులో ప్రీబయోటిక్‌గా పనిచేస్తాయి. ఇవి గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తాయి. పుట్టగొడుగులు తింటే.. పేగు వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**క్యాన్సర్‌తో పోరాడుతుంది..** పుట్టగొడుగులలో ఉండే లినోలిక్ యాసిడ్ యాంటీ కార్సినోజెనిక్ కాంపౌండ్‌గా పనిచేస్తుంది. శరీరంలో అధిక ఈస్ట్రోజెన్ స్థాయిల వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను అణిచివేసేందుకు. ఇది రొమ్ము క్యాన్సర్ నుంచి రక్షించడంలో సహాయపడుతుంది.

**డిప్రెషన్ తగ్గుతుంది..** పుట్టగొడుగులు శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయని స్టేట్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అధ్యయనంలో వెల్లడైంది. సుమారు 11 ఏళ్ల పాటు 24 వేల మంది ఆహార అలవాట్లను పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. పుట్ట గొడుగులు తినేవారికి డిప్రెషన్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటున్నట్టు తేల్చారు. పుట్ట గొడుగుల్లోని ఎర్గోథియోనీన్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది మన శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను అడ్డుకుంటుంది. పుట్టగొడుగుల్లో ఆందోళనను తగ్గించే పొటాషియం కూడా ఎక్కువగా ఉంటుంది.

**అందాన్ని పెంచుతుంది..** పుట్టగొడుగులను సౌందర్య ఉత్పత్తులలోనూ వాడతారు. మష్రూమ్స్ మన డైట్‌లో చేర్చుకుంటే.. చర్మం ముడతల నివారణిగానూ, కణాలను పునరుజ్జీవింప చేయడంలోనూ సహాయపడుతుంది. పుట్ట గొడుగుల్లో ఉండే పోషకాలు, ఔషధ గుణాలు ముఖకాంతిని పెంచుతాయి. అందుకే యాంటీ ఏజింగ్ క్రీములు, లోషన్లు, సీరమ్స్ తయారీలో పుట్ట గొడుగుల నూనెలను ఉపయోగిస్తుంటారు. పుట్టగొడుగులను ఆహారంలో భాగం చేసుకుంటే చర్మం పొడిబారడం సమస్య తగ్గుతుంది.

# భుజం నొప్పిని నిర్లక్ష్యం చేయవద్దు

ఎలాంటి నొప్పి అయినా అంటే కండరాలు, ఎముకల దగ్గరైనా ఉన్నప్పుడు దాన్ని వీలైనంత వరకూ కంట్రోల్‌లో ఉంచుకోవాలి. ఎప్పుడూ కూడా ఆ నొప్పిని పెంచుకోకూడదు. ఎందుకంటే నొప్పి మొదలైన తర్వాత మనం భరించగలం. కానీ, కొన్ని స్టేజెస్ దాటిన తరువాత దాన్ని మనం భరించలేం. అందువల్ల ఎప్పుడూ కూడా స్టార్టింగ్ స్టేజ్‌లోనే జాగ్రత్త పడాలి. అంతేకాక, ఎప్పుడైతే ఒకసారి ఎలాంటి నొప్పి అయినా ప్రొగ్రెస్‌గా ఉందంటే పెరిఫెరల్ రీజియన్స్‌ను ఎఫెక్ట్ చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

**భుజం నొప్పికి కారణం..** ఎప్పుడైతే మీకు భుజం నొప్పి వచ్చిందో దానికి కారణం మీ అలసట అని గుర్తించాలి. కానీ, ఎప్పుడైతే మీరు డాక్టర్‌ను సంప్రదించి చెకప్ చేయించుకుంటారో అప్పుడే మీకు సరైన కారణం తెలుస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలికంగా కనుక భుజం నొప్పితో బాధపడుతుంటే మరింత జాగ్రత్తగా ఉండాలని గుర్తుంచుకోండి. ఒకవేళ మీరు భుజం నొప్పితో కొద్ది రోజుల పాటు బాధపడుతూ ఉండి మెడ, భుజాల వద్ద ఏదో తెలియని సెన్సేషన్, బాగా స్టిఫ్‌గా ఉండడం వంటి లక్షణాలను ఎదుర్కొంటే మీరు సరైన విధంగా నిద్రపోలేదని అర్థం. అంటే పక్కకు తిరిగి నిద్రపోయే సమయంలో భుజాల పై ఒత్తిడి పడి సరైన పొజిషన్‌లో లేనప్పుడు ఇలాంటి నొప్పి వస్తుంది. కాబట్టి నిద్రపోయే సమయంలో జాగ్రత్త వహించాలి. ఒకవేళ కనుక కొద్ది రోజుల వరకు ఈ సమస్య తగ్గకపోతే అది సీరియస్‌గానే మీరు భావించాలి.

ఒకవేళ మీ భుజాలను, మెడ భాగాలను సరైన విధంగా కదిలించకపోతే దానికి చాలా కారణాలు ఉన్నాయి. అవే వాపు, ఫ్రాక్చర్, ఆర్థరైటిస్, భుజం భాగంలో ఉండే నరాలకు ఇబ్బంది కలగడం వలన పూర్తిగా కదిలించలేక పోతారు. ఫ్రోజెన్ షోల్డర్, సహజంగా ఈ సమస్య సరైన లైఫ్ స్టైల్ లేకపోవడం వల్ల వస్తుంది.

ఫ్రోజెన్ షోల్డర్ అంటే పూర్తిగా చేతిని కదల్చ లేకపోవడం, భుజాలను మూవ్ చేసే సమయంలో నొప్పి. ఇదే పరిస్థితి కొనసాగితే భుజాలు బలహీనంగా మారతాయి. పైగా ఎప్పుడైతే భుజాల నొప్పి వచ్చి, బలహీనంగా మారతాయో అప్పుడు రోటరీ కఫ్ లిగమెంట్, torn ligament, ఎముకలు జాయింట్ టిష్యూకి తగలడం, వంటి మొదలైన సమస్యలు తలెత్తుతాయి. ఇటువంటి సమస్యలతో మీరు బాధ పడుతుంటే కనుక బరువైన వస్తువులను



కూడా మీరు మోయలేరు.

**ఎందుకు నిర్లక్ష్యం చేయొద్దు.. ?** వీలైనంత త్వరగా మీ భుజాల నొప్పిని తగ్గించుకుంటే మేలని నిపుణులు చెబుతున్నారు. భుజాల నొప్పి సమస్యతో బాధపడుతూ సరైన ట్రీట్మెంట్ చేయించుకోకపోతే ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది. మన శరీర భాగాలలో మూమెంట్స్ చేయడానికి ఉపయోగించే భాగాల పని తీరు బాగుంటేనే ఎలాంటి సపోర్ట్ లేకుండా మనం జీవించగలం. కాబట్టి భుజం నొప్పి వంటి సమస్యలను వీలైనంతగా త్వరగా తగ్గించుకోవడానికి ప్రయత్నించండి. కొన్ని రకాల కండరాలు, జాయింట్స్, లిగమెంట్స్, టెన్డన్స్ మన భుజాలను కదపడానికి సహాయ పడతాయి. భుజాల వల్లనే మనం రాయడం, టైపింగ్ చేయడం, వస్తువులను పట్టుకోవడం, లాగడం వంటి మొదలైన పనులు చేస్తాము. అలాంటప్పుడు మీ భుజాలను వీలైనంత వరకు ఫ్లెక్సిబుల్‌గా ఉంచుకోవాలి.

**నొప్పి ఎందుకు వస్తుంది...?** బాగా అలసిపోవడం వల్ల భుజాల నొప్పి వస్తుంది. కానీ కొంత శాతం మందిలో ఎన్నో రకాల సమస్యలు వల్ల కూడా భుజం నొప్పి వస్తుంది అవి ఏంటంటే టెండోనిటిస్, ఇన్ఫ్లమేషన్, భుజాల స్టెబిలిటీ లేకపోవడం, షోల్డర్ డిస్ లోకేషన్ కావడం, కాలర్ బోన్, ఆర్మ్ బోన్ ఫ్రాక్చర్ అవ్వడం, ఫ్రోజన్ షోల్డర్, టోర్న్ టెన్‌డోన్స్, ఆర్థరైటిస్. ఫ్రోజన్ షోల్డర్‌కు గల కారణం ఏంటంటే డయాబెటిస్. ఎవరైతే డయాబెటిస్ సమస్యతో దీర్ఘకాలికంగా బాధ పడతారో వారికి ఫ్రోజెన్ షోల్డర్ సమస్య వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

భుజాల నొప్పి అనేది మెడకు సంబంధించిన, జాయింట్‌లకు సంబంధించిన సమస్యల ద్వారా కూడా వస్తుంది. అవే గ్లెనోహ్యుమరల్ జాయింట్, అక్రోమైక్లవిక్యులర్ జాయింట్, రొటేట్ కఫ్, భుజాల వద్ద ఉన్న ఇతర సాఫ్ట్ టిష్యూస్ కారణంగా కూడా భుజాల నొప్పితో బాధపడాల్సి ఉంటుంది. అయితే సహజంగా ఎక్కువ శాతం మందిలో భుజాల నొప్పి అనేదిరొటేట్ కఫ్ వల్ల వస్తుందని నిపుణులు చెబుతున్నారు. మిగిలిన శాతం వారిలో అయితే మజిల్ ఇన్ బ్యాలెన్స్, ఆర్థరైటిస్, ల్యాబరల్ టియర్స్ వల్ల వస్తుంది.

# కంటి రంగుతో ఐరన్ లోపాన్ని గుర్తించండి




ఎప్పుడైతే శరీరంలో పోషక విలువలకు సంబంధించిన లోపం కలుగుతుందో అప్పుడు మన శరీరంలో జరిగేటువంటి ప్రక్రియలు సరిగ్గా జరగవు. దాంతో ఆ డెఫిషియన్సీకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయి. ముఖ్యంగా ఐరన్ డెఫిషియన్సీ ఎక్కువ మంది ఎదుర్కొంటున్నారు. ఐరన్ డెఫిషియన్సీ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది.

మన శరీరంలో రెడ్ బ్లడ్ సెల్స్ ఎంతో అవసరం. వీటి వల్ల ఆక్సిజన్ లంగ్స్ ద్వారా అందడమే కాకుండా కార్బన్ డయాక్సైడ్ వదలడానికి కూడా సహాయం చేస్తాయి. ఎప్పుడైతే ఐరన్ లెవెల్స్ అనేవి శరీరంలో సరైన విధంగా ఉంటాయో దాని ప్రకారం రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తి బాగుంటుంది. ఒకవేళ శరీరంలో ఐరన్ డెఫిషియన్సీ ఉన్నా లేక సరిపడా ఐరన్ లేకపోయినా ఎన్నో లక్షణాలు కనబడతాయి.

ముఖ్యంగా నీరసం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది కలగడం వంటివి ఉంటాయి. అంతేకాకుండా ఐరన్ డెఫిషియన్సీ వల్ల చాలా ప్రమాదకరమైన కండిషన్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది అదే ఎనీమియా. ఎప్పుడైతే ఐరన్ డెఫిషియన్సీ సమస్యను ఎదుర్కొంటారు ఆ సమస్యను అనీమియా అంటారు.

**ఐరన్ డెఫిషియన్సీ వల్ల కంటి పై ఎఫెక్ట్..** ఎప్పుడైతే శరీరంలో ఐరన్ డెఫిషియన్సీ ఏర్పడుతుందో అప్పుడు రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తి తగ్గిపోతుంది. దాంతో శరీరంలో జరిగేటువంటి ఎన్నో ప్రక్రియలపై ప్రభావం చూపుతుంది. అంతే కాకుండా కంటి ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. అందువల్లే డాక్టర్స్ ఐరన్ డెఫిషియన్సీ వల్ల కంటి పై చాలా ప్రభావం ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే కంటి చూపు మెరుగైన విధంగా ఉంటుందని చెబుతారు.

ఎప్పుడైతే శరీరంలో ఐరన్ డెఫిషియెన్సీ ఏర్పడుతుందో అప్పుడు కంటి భాగంలో ఉండేటువంటి టిష్యూలకు సరిపడ ఆక్సిజన్ అందదు. దాంతో కళ్ళ రంగు మారిపోతుంది. ఈ లక్షణాన్ని మీరు ఎదుర్కొంటే మరింత జాగ్రత్త పడాలి.

ఐరన్ డెఫిషియన్సీ వల్ల కంటి రంగు మారటంతో పాటు కంటి రెప్పలపై కూడా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడైతే మీరు నీరసంగా, బలహీనంగా ఉన్నప్పుడు డాక్టర్‌ను సంప్రదిస్తారో అప్పుడు బేసిక్ ఎగ్జామినేషన్‌లో కంటిని కూడా చెక్ చేస్తూ ఉంటారు. అదేంటంటే కంటి కింది భాగంలో ఉండే కను రెప్పను చెక్ చేసి మీ ఆరోగ్యాన్ని గమనిస్తారు. అలా టెస్ట్ చేయడానికి గల కారణం ఐరన్ డెఫిషియన్సీ ఉందని, అది కంటి కింది భాగంలోనే కనబడుతుంది.

అందుకే కంటి రంగుని చూసి దాని ప్రకారం ఐరన్ డెఫిషియన్సీను గమనిస్తారు. అలా టెస్ట్ ఎందుకు చేస్తారంటే రెడ్ బ్లడ్ సెల్స్‌లో ఉండేటువంటి హెమోగ్లోబిన్ రక్తం రంగును నిర్ణయిస్తుంది. అందుకే ఎప్పుడైతే ఐరన్ డెఫిషియన్సీ ఏర్పడుతుందో అప్పుడు రక్తం ఎర్రగా ఉండదు. సహజంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు కళ్ళు లైట్ పింక్ కలర్‌లో ఉంటాయి. కానీ ఐరన్ డెఫిషియన్సీ ఏర్పడినప్పుడు కంటి రంగు తెలుపుగా మారుతుంది.

**ఐరన్ డెఫిషియన్సీ లక్షణాలు :** ఇక మనం ఐరన్ డెఫిషియన్సీ లక్షణాలు చూసేస్తే.. నేషనల్ హెల్త్ లంగ్ మరియు బ్లడ్ ఇన్స్టిట్యూట్ ప్రకారం ఐరన్ డెఫిషియన్సీ మైల్డ్ లేక మోడరేట్‌గా ఉన్నప్పుడు ఎలాంటి లక్షణాలు కనబడవు. ఒకవేళ ఈ కండిషన్ సీరియస్‌గా ఉంటే కొన్ని రకాల లక్షణాలు కనపడతాయి అవి ఏంటంటే ఎక్కువగా అలసిపోవడం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడటం, ఛాతి నొప్పి వంటి సమస్యలను ఎదుర్కొంటారు. అయితే మరికొంతమందికి అర చేతులు, పాదాలు చల్లగా అవ్వడం, గోర్లు సరిగ్గా ఎదగకపోవడం, నాలుక ఇన్ఫ్లమేషన్‌కు గురవ్వడం వంటి లక్షణాలను కూడా ఉంటాయి.

**ఐరన్ డెఫిషియెన్సీ ఉందని ఎలా తెలుసుకోవాలి.. ?** ఒకవేళ మీరు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేదా సూచించినట్లుగా ఫుల్ బ్లడ్ కౌంట్ టెస్ట్ చేయించుకుంటే మీ రెడ్ బ్లడ్ సెల్స్ సైజ్, కలర్ వంటి వాటిని పూర్తిగా తెలుసుకోవచ్చు. అంతే ఈ విధంగా రక్తం వాల్యూమ్, పర్సంటేజ్ తెలుసుకోవడం వల్ల దానిలో ఉండేటువంటి హెమోగ్లోబిన్, ferritin లెవెల్స్ తెలుస్తాయి. ఈ లెవెల్స్‌లో ఉండే ప్రోటీన్‌లో ఐరన్ స్టోర్ అవుతుంది. ఈ విధంగా మనం శరీరంలో ఉండేటువంటి ఐరన్ శాతం గురించి తెలుసుకోవచ్చు.

**ఐరన్ లెవెల్స్‌ను ఎలా పెంచుకోవాలి.. ?** ఎప్పుడైతే ఐరన్ డెఫిషియన్సీను ఎదుర్కొంటారో అప్పుడు ఐరన్ ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఎన్నో రకాల ఆహార పదార్థాలు మన శరీరంలో ఐరన్‌ను పెంచడానికి సహాయపడతాయి. మయో క్లినిక్ ప్రకారం రెడ్ మీట్, సీఫుడ్, డ్రై ఫ్రూట్స్, బీన్స్, పాలకూర వంటి ఆకుకూరలు, బ్రెడ్, పాస్తా వంటి ఐరన్ fortified cerealsను కూడా తీసుకోవచ్చు. ఈ రకమైన ఆహార పదార్థాలలో పుష్కలంగా ఐరన్ ఉంటుంది. కాబట్టి ఖచ్చితంగా ఇటువంటి ఆహార పదార్థాలను మీరు డైట్‌లో భాగంగా తప్పక తీసుకోండి.

అంతే కాకుండా ఐరన్ శాతం పెరగాలంటే మీ రోజువారి ఆహారంలో భాగంగా ఐరన్‌తో పాటు విటమిన్ సి కూడా తీసుకోవాలి. ఎందుకంటే విటమిన్ సి తీసుకోవడం వల్ల ఆహారం నుండి ఐరన్‌ను ఈజీగా అబ్సార్బ్ చేసుకుంటుంది. విటమిన్ సి, ఆస్కార్బిక్ యాసిడ్‌ను కూడా తీసుకోవచ్చు.

**సప్లిమెంట్స్ తీసుకోవాల్సిన అవసరం ఉందా...?** నిజానికి ఎలాంటి డెఫిషియన్సీతో అయినా బాధ పడుతుంటే మీ పరిస్థితి బట్టి సప్లిమెంట్స్ తీసుకోవాలి. అంటే ఒకవేళ మీకు అవసరం అయితేనే తీసుకోవాలి. అది కూడా డాక్టర్ ఇచ్చిన సూచనల మేరకు పాటించాలి. ఎప్పుడూ కూడా సప్లిమెంట్స్ స్వయంగా తీసుకోకూడదు. ఎప్పుడైతే ఐరన్ లెవెల్స్ బాగా తక్కువగా ఉంటాయో అప్పుడు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మేరకు సప్లిమెంట్స్ తప్పకుండా తీసుకోవాలి. దాంతో పాటు మీరు ఎదుర్కొన్న డెఫిషియన్సీకు సంబంధించిన ఆహార పదార్థాలను తీసుకుంటూ ఉండాలి.

## అగ్ని బాధితునికి నిత్యావసర సరుకులు అందజేసిన ఉగ్గిన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): కసింకోట మండలం నర్సింగబిల్లి లో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి నష్టపోయిన టిఫిన్ షాపు యజమాని ఉప్పల శ్రీనివాసరావుకు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి తన ఉగ్గిన గంగునాయుడు సేవా సంఘం తరపున ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కాయల మురళీ,ఉగ్గిని గంగునాయుడు సేవాసంఘం అధ్యక్షులు కలగా సోమేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మజ్జి నానిబాబు,మజ్జి నిరంజన్ కుమార్,డాక్టర్ రమేష్, నైనంశెట్టి రమణారావు,చేబోలు సూరిబాబు,కర్రి దుర్గ నాయుడు,షేక్ దర్గా,జెర్రిపోతుల నూకినాయుడు, తాడి రమణ,కర్నం గోవింద,మజ్జి ప్రసాద్, తెరపల్లి శ్రీను,కొఠారి సంతోష్,భీముని దాసు,తాతాజీ, మాటూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో ఖాళీ స్థలాల ఆక్రమణ!



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ జగనన్న కాలనీ లో సబ్ స్టేషన్ నుండి వెన్నెలపాలెం వెళ్లే రహదారిలో నిర్మించిన జగనన్న కాలనీ ఖాళీ స్థలాలు రోడ్లు, కాలువల నిర్మాణాలకు విడిచిపెట్టిన స్థలాలను కొంతమంది ఆక్రమించుకున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇటువంటి వాటిపై సంబంధించిన అధికారులు, తహసిల్దార్ ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించి అట్టి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని జగనన్న కాలనీ వాసులు విన్నవించుకుంటున్నారు. వీటిపై కొందరు ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్ళే ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది.

## పారిశ్రామిక క్లస్టర్లలో మౌలిక సదుపాయాలకి నిధులు మంజూరు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి పార్లమెంటు పరిధిలో గల రాంబిల్లి, నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ లలో మౌలిక వసతులైన అంతర్గత రహదారులు, అప్రోచ్ రోడ్లు మొదలైన వాటి నిర్మాణానికి ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా రెండవ విడత నిధులు మంజూరు అయ్యాయని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తెలిపారు. తమ ప్రాంత అభివృద్ధికి కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా నిధులు విడుదల చేయించిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా అనకాపల్లి -అచ్యు తాపురం మధ్య సుమారు 13. 8 కిలోమీటర్ల రహదారి విస్తరణ కు , నక్కపల్లి పారిశ్రామిక క్లస్టర్ కు యాక్సిస్ రోడ్ నిర్మాణ పనులకు కూడా నిధులు మంజూరు అయినందుకు తనఆనందాన్ని వ్యక్తం చేశారు.పారిశ్రామిక వాడలు అభివృద్ధి చెందడం ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి అని తన హర్షాన్ని వ్యక్తం చేశారు.

## మహానాడుకు తరలి వెళ్లిన మండల టీడీపి నాయకులు



పరవాడ, (విశాఖ సమాచారమ్): రాజమహేంద్రవరం లో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కు పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం తరలి వెళ్లారు. మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు మరియు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో బొండా తాతారావు, సారిపల్లి జోగి నాయుడు, కలిదిండి రామకృష్ణ రాజు, కూండ్రపు శ్రీనివాస్, పైల వరలక్ష్మి ,పైలా అప్పల నాయుడు,పైలా కుమారి, జాజుల చిన్నా రావు, గుండా వెంకటేష్, శివలంక గౌతమ్, మువ్వల సింహాచలం ,నంబారి రమణ, గౌరుసు అప్పల రాజు, మొల్లి బాలాజీ పాల్గొన్నారు.

# "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమం నందు పరిష్కారాలు సంతృప్తికరం




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజల సమస్యల పరిష్కార వేదికైన "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమాన్ని ప్రతి సోమవారం క్రమం తప్పకుండా జివిఎంసి నిర్వహిస్తూ, "జగనన్నకు చెబుదాం" (స్పందన) లో వివిధ సమస్యలపై ప్రజల నుండి నగర మేయర్, కమిషనర్ అర్జీలను స్వీకరిస్తూ, నిర్ణీత సమయంలో ఆయా సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన, సంతృప్తికరమైన సేవలను జివిఎంసి అందిస్తూ వస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమాన్ని "జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమంగా 2023 మే 9వ తేది నుండి జివిఎంసి నందు నిర్వహించండం జరుగుతుందని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

విశాఖ నగరంలో జివిఎంసి, ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర అంశాలలో నివాసితులకు కలుగుతున్న వివిధ సమస్యలపై సత్వర పరిష్కారాన్ని కోరుతూ జివిఎంసి ప్రధాన కార్యాలయం నందు, అన్ని జోనల్ కార్యాలయాల నందు ప్రజలు అర్జీలను నమోదు చేసుకొని, స్పందన కార్యక్రమం నందు సమర్పించడం జరుగుతున్నది. అలా "జగనన్నకు చెబుదాం" (స్పందన) లో స్వీకరించిన అర్జీదారుల సమస్యలను పరిష్కారాల నివృత్తికై జివిఎంసి సాంకేతిక పద్ధతి ద్వారా సంబంధిత విభాగాలకు వెంటనే పంపించి, సమస్యలను పరిష్కరించే ప్రక్రియ జరుపుచున్నది. ఆయా సమస్యల పరిష్కారం అనంతరం, అర్జీ దారులకు సంబంధిత జోనల్ కార్యాలయాల నుండి ఫోన్ల ద్వారా వారి వారి సమస్య పరిష్కారమైనదీ, కాలేనిదీ అనే అభిప్రాయాలను తెలుసుకోవడం జరుగుచున్నది. అర్జీదారులకు సంబంధించి సమస్యలను నివృత్తి చేయుటకు అవి దీర్ఘకాలికమైనచో, అర్జీదారునికి ఆ సమాచారాన్ని తెలియజేసే ప్రక్రియ జివిఎంసి జరుపుచున్నది.

జివిఎంసి నందు ప్రతి సోమవారం నాడు జరుగుచున్న "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమమే కాకుండా, టోల్ ఫ్రీ నంబర్ -1800 4250 0009, www.gvmc.gov.in వెబ్సైట్, వాట్సాప్ నంబర్ - 96669 09192, వైజాగ్ స్మార్ట్ సిటీ మొబైల్ యాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ గల సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలు సమస్యలను తెలుపుకునే ఆధునిక విధానాన్ని కూడా జివిఎంసి అందుబాటులో ఉంచి, నిత్యం నమోదవుతున్న ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రక్రియ జివిఎంసి జరుపుచూనే ఉంది. "స్పందన" కార్యక్రమానికి నేరుగా వచ్చి అర్జీలను సమర్పించుటకు అవకాశం లేని /వీలుకాని ప్రజలు జివిఎంసి కల్పించిన మాధ్యమాల ద్వారా సమస్యలను జివిఎంసికి తెలియజేసి, పరిష్కారాన్ని పొందవచ్చని కమిషనర్ తెలిపారు.

అంతే కాకుండా, రాష్ట్ర ప్రజలు వారి వారి సమస్యలను విన్నవించుకొనుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశ పెట్టిన "జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమంలో 1902 నెంబర్ కు నగర పౌరులు ఫోన్ చేసి సమస్యలను తెలియ జేయడం ద్వారా పరిష్కారాలను పొందవచ్చునని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని జివిఎంసి మేయర్, కమీషనర్ తెలిపారు.

టౌన్ ప్లానింగ్ స్పందన కార్యక్రమం: ప్రతి సోమవారం జరుగుచున్న "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన సమస్యలు విరివిగా వచ్చుచున్నందున, ప్రత్యేకించి ప్రతి "టౌన్ ప్లానింగ్ స్పందన" కార్యక్రమాన్ని ప్రజల నుండి వినతులను స్వీకరించుటకుగానూ జివిఎంసి నిర్వహిస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుచున్నవని కమిషనర్ తెలిపారు.

డయల్ యువర్ మేయర్ కార్యక్రమం: ప్రతి నెలలో రెండు, నాలుగు సోమవారాలలో "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమానికి ముందుగా "డయల్ యువర్ మేయర్" కార్యక్రమం స్వయంగా విశాఖ నగర గౌరవ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నిర్వహిస్తూ, ప్రజల నుండి ఫోన్ ద్వారా సమస్యలను స్వీకరించడం జరుగుచున్నదని కమిషనర్ పేర్కొన్నారు. అలా స్వీకరించిన ప్రజల సమస్యలను, సత్వర పరిష్కారానికై సంబంధిత విభాగాలకు పంపించే ప్రక్రియ జివిఎంసి జరుపుచూనే వున్నది. అనంతరం ఆ వారంలో, గౌరవ మేయర్ యాదృచ్ఛికంగా ఆ యా ఫిర్యాదుదారులకు స్వయంగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడం ద్వారా, వారు.. పరిష్కారమైందంటూ జివిఎంసి సేవలపై సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

2022 ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి నేటి వరకు "జగనన్నకు చెబుదాం" (స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి 9702 వినతులను స్వీకరించగా, అందులో 9583 పరిష్కరించగా, మిగిలినవి 119 వినతులు వివిధ దశల్లో పరిష్కరించుటకు ఉన్నవని కమిషనర్ తెలిపారు.

ఇలా జివిఎంసి, ప్రజల కొరకు కల్పించిన అన్ని మార్గాల ద్వారా స్వీకరించిన ప్రజల వినతులను/ అర్జీలను పరిష్కరిస్తూ, మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజలకు సేవలను, సంక్షేమాన్ని అందించడమే ధ్యేయంగా జివిఎంసి యంత్రాంగం నిత్యం విధులు నిర్వహించడం జరుగుచున్నదని నగర మేయర్, కమిషనర్ తెలిపారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి - ఎన్టీఆర్



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): నక్కపల్లి మండలం వేంపాడు గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి శతజయంతి ఉత్సవాలు వేంపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ఉపాధ్యక్షుడు పల్లా రాంబాబు,కమ్మిళ శివరామకృష్ణన్ రాజు, అయినం పూడి అప్పలరాజు, ఎంపీటీసీ కుంచే మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ఎన్టీఆర్ శిలా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీటీసీ కుంచే మధు మాట్లాడుతూ ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారరని కొనియాడారు. అనంతరం గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఆహార పొట్లాలు, మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి వరహాలరాజు (బుజ్జి), దేనుముకొండ సూరిబాబు రాజు, అయినంపూడి రవి,కల్లెపల్లి అప్పలరాజు, పిట్టా శ్రీను, పల్లా నాగరాజు,కమిడి వెంకట రమణ(శ్రీను),గుడాల దావీదు, ఇసరపు పాపారావు, యాదగిరి నూకరాజు, పిట్టా నాగేశ్వరరావు, కరక శివ,చందనాడ కొండయ్య,దారబాల అప్పారావు, శ్రీమతికమిడి మంగ,అల్లు సత్యవతి,దారబల బంగారమ్మ, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్య కర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ, కళా రంగాలకు పెద్ద పీట వేస్తున్న జార్జి క్లబ్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జార్జి క్లబ్ క్రీడా సాంస్కృతి కార్యక్రమాలు ప్రొత్సహించే కార్యక్రమంలో భాగంగా ఓపెన్ థియేటర్, జిమ్ ను అభివృద్ధి చేశారు. కొణతాలవెంకటనారాయణమ్మ పేరిట నూతనంగా తీర్చిదద్దిన ఓపెన్ ఎయిర్ థియేటర్ను క్లబ్ అధ్యక్షుడు బుద్ధ కాశీ , కోలపర్తి అప్పారావు దేవుళ్ళమ్మ పేరుతో అధునాతన పరికరాలతో అభివృద్ధి చేసిన జిమ్మును క్లబ్ కోశాధికారి ఆళ్ల వెంకట నూకేశ్వరరావు ప్రారంభించారు. అలాగే క్లబ్ బిల్డింగ్ పై ఏర్పాటు చేసిన 5కేవి సోలార్ ప్రాజెక్టును క్లబ్ కార్యదర్శి మల్ల చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షుడు బుద్ధ కాశి మాట్లాడుతూ జార్జి క్లబ్ క్రీడ కళా రంగాలకు పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వచ్చేనెల మొదటి వారంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిమ్ అభివృద్ధికి విరాళంఅందజేసిన కోలపర్తి కన్నబాబు, ఓపెన్ ఆడిటోరియం విరాళ దాతలు కొణతాల జగన్నాథ రావు నాయుడు, కొణతాల పూర్ణచంద్రరావు, కొణతాల వాసు, ప్రసాద్, క్లబ్బు ఉపాధ్యక్షుడు చవితిన నర్సింగరావు, సహాయ కార్యదర్శి ఆళ్ల సూర్య రామకృష్ణ, డైరెక్టర్లు బొడ్డేడ భాస్కరరావు, మల్ల సీతామహేశ్వరరావు, పీలా అచ్యుతం, డి వి ఎస్ కే నాయుడు, సూరే సతీష్, వాకాడ కోటేశ్వరరావు, బుద్ధ రమణాజీ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎల్లపు సాంబశివ, జిమ్ కోచ్ ఎంఎన్ఎస్ అప్పారావు, రాపేటి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఆక్రమణలు తొలగింపు



రావికమతం, (విశాఖ సమాచారమ్): రావికమతం మండల కేంద్రం లో ఆర్ అండ్ బి రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను శరవేగంగా తొలగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, ఆర్అండ్బి, పంచాయతీ అధికారులు, దగ్గరుండి ఆక్రమణ లను మొత్తం జెసిబి సహాయంతో పూర్తిగా తొలగించారు. అలాగే రోడ్డుకిరువైపులా రోడ్డు ఆక్రమణ లో ఉన్న కొంతమంది స్వచ్ఛందంగా వారికి వారే తొలగించుకున్నారు. ఎక్కడ ఏ విషయంలో కూడా రాజీ పడకుండా అధికారులు నిష్పక్షపాతంగా పనులను ముమ్మరంగా చేపట్టారు. దీంతో ఆక్రమణదారులకు కొంత అసౌకర్యం కలిగినప్పటికీ పూర్తిగా ఆక్రమణలు తొలగించేసరికి రోడ్డు పూర్తి స్థాయిలో వెడల్పు రావడం చాలా మంచి జరిగినట్లు పలువురు భావిస్తున్నారు. బస్సులు, పలు రకాల వాహనాలు తప్పుకునేందుకు వాహన చోదకులు పలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నేడు ఆ పరిస్థితి నుండి బయటపడే పరిస్థితి నెలకొందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు మధ్య నుంచి రోడ్డుకిరువైపులా 30 అడుగుల చొప్పున రోడ్డు మార్జిన్ ను లో ఉన్న ఆక్రమణలను తొలగింపు చేస్తున్నారు .గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ఎంతవరకు అయితే ఉందో అంతవరకు పూర్తిగా తొలగించడం జరిగింది .పాత డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అంతా మరమ్మతులు చేపట్టడంతో పాటు పూడిక తీయడం, డ్రైన్ సిస్టం లేని వద్ద కొత్త డ్రైను ఏర్పాటు చేయడానికి ఆర్డబ్ల్యూఎస్ అధికారులుచే ఎస్టిమేట్లు తయారు చేసి పనులను పూర్తి చేయడం జరుగుతుందని సంబంధిత పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ ,ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల కేంద్రం ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి గుర్రయ్యకట్టువరకు పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగిస్తూ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసేందుకు పూర్తీ ఏర్పాట్లను చేపట్టారు. రోడ్డు ఆక్రమణల వలన పాఠశాల విద్యార్థులు స్కూలుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నేడు ఆ పరిస్థితి నుంచి గట్టెక్కినట్ల అయిందని పలువురు విద్యార్థులు భావిస్తున్నారు. అలాగే తొలగిస్తున్నటువంటి ఆక్రమణల చెత్తాచెదారాన్ని జెసిబి ట్రాక్టర్ సహాయంతో వెంట వెంటనే డంపింగ్ కు తరలించడం జరుగుతుంది.

## కాన్పూర్ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ ప్రారంభం



యూపీలో వచ్చే ఏడాది ఎన్నికలకు ముందు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని భావిస్తున్న సీఎం యోగీ ఆదిత్యనాథ్.. పలు ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. వాటికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టడంతో పాటు రాష్ట్రం తరపున నిధులు కేటాయిస్తూ వాటిని శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇదే క్రమంలో కాన్పూర్ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ భవనాన్నికూడా ప్రారంభించారు. గతంలో ఉన్న టెర్మినల్ కంటే 16 రెట్లు ఎక్కువ సామర్థ్యంతో ఇది పనిచేయబోతోంది.

ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో పాటు కేంద్ర పౌర విమానయానశాఖ అందించిన సహకారంతో కాన్పూర్ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ నిర్మాణం పూర్తి చేసుకుంది. దీన్ని ఏఏఐ ఛైర్మన్ సంజీవ్ కుమార్, కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, వీకే సింగ్ లతో కలిసి ఈ టెర్మినల్ ను సీఎం యోగీ ఆదిత్యనాథ్ ప్రారంభించారు. కాన్పూర్ ఎయిర్ పోర్టు రూపురేఖల్ని మారుస్తుందని భావిస్తున్న ఈ టెర్మినల్ స్థానికులకు గిఫ్ట్ అని యోగీ తెలిపారు.

2017లో తాను అధికారంలోకి వచ్చే నాటికి యూపీలో రెండు ఎయిర్ పోర్టులు మాత్రమే ఉండేవని, అవి కూడా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని, కానీ ఇప్పుడు 9 ఎయిర్ పోర్టులు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని, మరో డజను విమానాశ్రయాలు వివిధ దశల్లో ఉన్నాయని సీఎం యోగీ ఆదిత్యనాథ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా డిఫెన్స్ కారిడార్ నిర్మాణం ద్వారా ప్రధాని నరేంద్రమోడీ .. కాన్పూర్ కు పునర్ వైభవం తీసుకున్నట్లు యోగీ వెల్లడించారు.

కాన్పూర్ లో మెట్రో తర్వాత ఎయిర్ పోర్టు ఉండాలన్న స్థానికుల కలను కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ, సీఎం యోగీ నెరవేర్చినట్లు పౌరవిమానయానమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. భవిష్యత్తులో కాన్పూర్ ఎయిర్ పోర్టులో అన్ని సదుపాయాలు కల్పిస్తామని, ఇక్కడి నుంచి దేశీయ విమానాలతో పాటు అన్ని సర్వీసుల్ని నడుపుతామన్నారు. పారిశ్రామిక నగరంగా మారుతున్న కాన్పూర్ లో ప్రజల అవసరాలకు తగినట్లుగా దీన్ని అభివృద్ధి చేస్తామని సింధియా ప్రకటించారు.

## శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



పరవాడ,(విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం నాయుడుపాలెం మరియు ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధిలో రజకుల కాలనీ లో నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బండారు బాబురావు 5 వేల రూపాయలు శనివారం విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో లాలం అప్పలనాయుడు, సమ్మంగి సోమేశ్వరరావు,ఓలిశెట్టి అప్పలరాజు,కణితి చిన సోమేశ్వరరావు, సమ్మంగి అప్పారావు, ఈరుగుల లక్ష్మీప్రసాద్ కిలపర్తి అప్పలనాయుడు,పిడిమి తాతాబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి మహానటుడు డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించబడుతున్న మహానాడు కి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాజమహేంద్రవరం తరలి వెళ్లారు. అనకాపల్లి పట్టణ టిడిపి నాయకులు రాష్ట్ర బీసీ సాధికార సమితి గవర ఇంచార్జ్ మళ్ళ సురేంద్ర, జిల్లా కార్యదర్శి, పొలరపు త్రినాథ్, 83వ డివిజన్ ఇంచార్జ్ బొద్దాపు ప్రసాద, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బరవపు గణేష్, రాష్ట్ర శెట్టి బలిజ (యాత) కమిటీ సభ్యుడు

యల్లకి సత్తిబాబు, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు పిట్ల రాజు, జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి దాడి జగన్, పట్టణ టిఎన్ఎస్ఎఫ్ ప్రెసిడెంట్ ఆకుల నానాజీ, జిల్లా పద్మశాలి నాయకులు తిప్పన అప్పారావు, సీనియర్ నాయకులు పూడి త్రినాధరావు, జిల్లా టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి కార్తీక్, 81వ డివిజన్ నాయకులు మళ్ళ సూరిబాబు, వేగి కృష్ణ, కర్రీ నాయుడు, పెంతకొట శ్రీను, జొన్నద సురేష్, నియోజవర్గ మీడియా కో-ఆర్డినేటర్ ఎస్. భానుచందర్ (అఖి) తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు

# ఆ రాష్ట్రాల విద్యార్థులపై ఆస్ట్రేలియన్ యూనివర్శిటీల బ్యాన్

భారత విద్యార్థులకు షాకిచ్చాయి ఆస్ట్రేలియాకు చెందిన విశ్వవిద్యా లయాలు. దేశంలోని కొన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల వీసాల మీద బ్యాన్ విధించాలన్న నిర్ణయం ఇప్పుడు షాకింగ్ గా మారింది. ఆస్ట్రేలియా వర్సిటీలు ఇంతటి తీవ్ర నిర్ణయానికి ఎందుకు వచ్చాయి? అందుకు దారి తీసిన కారణాలేంటి? ఇంతకూ ఆ రాష్ట్రాలేంటి? అన్న వివరాల్లోకి వెళితే..

దేశంలోని కొన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఆస్ట్రేలియాలో ఉన్నత విద్య కోసం దరఖాస్తులు చేస్తున్నారు. అయితే.. అందులో పేర్కొంటున్న సమాచారం మొత్తం వాస్తవమైనవి కాదని.. మోసపూరితమన్న విషయాన్ని గుర్తించారు. దీంతో.. ఆస్ట్రేలియాకు చెందిన పలు వర్సిటీలు భారత్ లోని కొన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు వీసాలు జారీ చేసే విషయంలో బ్యాన్ పెట్టాలని నిర్ణయించాయి.

తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్రాలు ఇవే ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, జమ్ముకశ్మీర్.

ఈ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు వీసాలు జారీ చేసే విషయంలో తాత్కాలిక నిషేధ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల నుంచి వచ్చే వీసా అప్లికేషన్లను స్వీకరించొద్దని ఫెడరేషన్ యూనివర్సిటీ.. వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీలు తాజాగా ఆదేశాలు జారీ చేశాయి. ఆ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు దాఖలు చేస్తున్న అప్లికేషన్ లలోని సమాచారం మొత్తం మోసపూరితంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఈ విషయాన్ని తమకు ఆస్ట్రేలియా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిందని చెప్పటం గమనార్హం. దీంతో.. ఈ రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల వీసాల మంజూరును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లుగా అధికారులు ప్రకటించారు. భారత్ నుంచి వచ్చిన వీసా అప్లికేషన్లలో రిజెక్టు కావటం గడిచిన పదేళ్లలో ఈసారే ఎక్కువని చెప్పటం విశేషం. మొత్తం అప్లికేషన్ల లో దాదాపు 25 శాతం వరకు మోసపూరితంగా ఉన్నట్లుగా వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

తాజాగా విధించిన బ్యాన్ కనీసం రెండు నెలల పాటు ఉంటుందన్న అంచనా వినిపిస్తోంది. ఇక..




ఆస్ట్రేలియాకు చెందిన విక్టోరియా వర్సిటీ.. ఎడిత్ కోవన్ వర్సిటీ.. యూనివర్సిటీ ఆఫ్ వోలోంగాంగా.. టోరొన్స్ లాంటి ప్రముఖ వర్సిటీలు తమకు వచ్చిన అప్లికేషన్లను పరిశీలించేందుకు తమకు అనుబంధంగా కొన్ని ఏజెన్సీలను ఏర్పాటు చేసుకొని.. వారి నుంచి వచ్చిన మొయిల్స్ ఆధారంగా విద్యార్థులకు వీసాల్ని మంజూరు చేస్తున్నారు. సో.. ఫేక్ సర్టిఫికెట్లతో.. పత్రాలతో వీసాల మీద గురి పెట్టిన వారు కాస్త వెనక్కి తగ్గితే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మొక్కల పెంపకంలో పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యం ఉండాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పర్యావరణ దినోత్సవం జూన్ 6వ తేదీ నుండి జరిగే మొక్కల పెంపకంలో జిల్లాలోని పారిశ్రామిక సంస్థలు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా సర్వతోముకాభివృద్ధికి పరిశ్రమలు కీలకమని అదేవిధంగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. పరిశ్రమల స్థాయిని బట్టి 500 నుండి 2000 వరకు మొక్కలు నాటాలన్నారు. ఎన్ టి పి సి, బార్క్ సంస్థలు చెరో పదివేల మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమం జూలై 31 వరకు జరుగుతుందన్నారు. చెరువులు నదులు రోడ్లు రైల్వే లైన్ల ప్రాంతాలలో మొక్కలు నాటేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సమస్యలను తమ దృష్టికి తెచ్చినట్లయితే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. లైసెన్సుల ప్రక్రియను ఆన్లైన్ చేసినందున వేగవంతం చేయగలిగామన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును గూర్చి యాక్షన్ టేకెన్ రిపోర్టును జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి. శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సూచనలు ఇచ్చారు. తరువాత పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధిని గూర్చి చర్చించారు.సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి స్మరణ్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ, ఎమ్మెస్ ఎం ఈ నమెంబర్ నదియా ఏపీఐఐసీ జడ్డం త్రినాథ్, పి.డి. డి. ఆర్.డి.ఏ. లక్ష్మీపతి ఆర్డీవో వీర్రాజు డిపిఓ శిరీష రాణి ఫ్యాక్టరీల ఇన్స్పెక్టర్ , కాలుష్య నియంత్రణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ టీచర్ల బదిలీల్లో సర్కార్ మరో ట్విస్ట్-వీరికి మాత్రం నో ఛాన్స్..!



ఏపీలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల మేరకు అర్హులైన వారు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడం, వారిని బదిలీ చేయడం జరుగుతోంది. అయితే సర్కార్ తాజాగా ఇందులో మరో నిబంధన చేర్చింది. ఈ నిబంధన పరిధిలోకి వచ్చే టీచర్లను బదిలీలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంది. దీంతో టీచర్ల బదిలీల ప్రక్రియలో ఇప్పుడు ఈ నిబంధన కలకలం రేపుతోంది.

అసలు విషయానికొస్తే గతేడాది పదో తరగతి పరీక్షల సందర్భంగా ప్రశ్నాపత్రాలు లీకయ్యాయి. ఇందులో పలువురు ఉపాధ్యాయుల పాత్ర ఉన్నట్లు తేలింది. వీరిలో కొందరు వాట్సాప్ లో ప్రశ్నాపత్రాలు సర్క్యులేట్ చేయడం, మరికొందరు మాస్ కాపీయింగ్ కు ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. వీరిపై విచారణ నిర్వహించిన ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఇలా క్రమశిక్షణా చర్యలకు గురైన టీచర్లను ఇప్పుడు బదిలీల కౌన్సిలింగ్ కు అనర్హులుగా పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.

ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు నిన్నటితో ముగిసింది. ఈ క్రమంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది. వీరికి ఇచ్చిన నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి బదిలీల్లో చేరుస్తుంది. ఇప్పుడు ఈ నిబంధనల్లో క్రమశిక్షణా చర్యల నిబంధన చేర్చడంతో గతేడాది ఇలా చర్యలకు గురైన ఉపాధ్యాయులు ఎవరైనా ఉంటే వారు బదిలీలకు అనర్హులు అవుతారు.

ఈసారి రిక్వెస్ట్ బదిలీల కోసం మొత్తం 75 వేల మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తప్పనిసరి బదిలీల కోసం 32 వేల మంది దాకా దరఖాస్తు చేసుకున్నారు. టీచర్లకు 8 ఏళ్లు, హెచ్ఎంలకు ఐదేళ్లు పూర్తయితే తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే భార్యా లేదా భర్త తమ స్పౌజ్ పనిచేసే ప్రాంతాలకు దగ్గర్లో బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల్ని కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం తెలిపింది. వీటిని ఉల్లంఘించి అక్రమంగా బదిలీకి దరఖాస్తు చేసుకుంటే మాత్రం క్రమశిక్షణా చర్యలతో పాటు మూడు ఇంక్రిమెంట్ల కోత పడబోతోంది.

# 29న కూలీల ధర్నా



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 29వ తేదీ అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు మండలంలో నీలకుండీలు, జానకియ్యపేట గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామాలలో జరిగిన కూలీల సమావేశంలో ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించేసి ఇష్టానుసారం వ్యవహరి స్తున్నది గత బడ్జెట్ లో 1 లక్ష కోట్లు కేటాయించారు, ప్రస్తుతం కూలీల సంఖ్య పెరిగింది పని డిమాండ్ పెరిగింది కూలీ పెంచాల్సి ఉంది అలాంటిది ఈసంవత్సరం కేంద్ర బడ్జెట్ లో 30 వేలు కోట్లు తగ్గించి, కేవలం 70 వేలు కోట్లు మాత్రమే కేటాయించి, కూలీల నోటి కాడ కూడు కొట్టారని దీన్ని కూలీలందరూ వ్యతిరేకించాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా 30% వేసవి అలవెన్స్, మంచి నీరు కు,పార, గుణపంలకు,తట్టలకు డబ్బులు, నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ పంపిణీ చేయడానికి నిధులు లేవని పేదలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశాన్ని దోసుకుంటున్న కార్పోరేట్లకు 11 లక్షల 50 వేల కోట్లు ఋణాలు ఎలా మాఫీ చేస్తారని ప్రశ్నించారు. పాత పద్ధతిలో పనులు నిర్వహించాలని పే స్లిప్ లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధి కూలీలు కు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, జిల్లా సీఐటీయూ కమిటీ సభ్యులు ఎం.నానాజీ నాయకులు మనబాల కొండబాబు, మనబాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# టీడిపి మాజీ వార్డ్ మెంబర్ దొర పండుతో పాటు 30 కుటుంబాలు

## పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిక



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి పార్టీ. ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గిరిజన హక్కులు చట్టాలకు భంగం కలిగిస్తుంది. బోయ. బెంతు ఒరియా. గిరిజనేతరులకు గిరిజన జాబితాలో కలపడానికి అసెంబ్లీలో తీర్మానాన్ని. వ్యతిరేకిస్తూ అరకు వ్యాలీ మండలము పెద్దలబుడు పంచాయితీ పిట్టమామిడి వలస తెలుగుదేశం పార్టీ మాజీ వార్డు మెంబర్ దొర పండు గారితో పాటు పూజారి కొండలరావు. దొర సన్యాసిరావు. దొర విజయ్ కుమార్. దొర ప్రసాద్. సోమేల నాగేశ్వరరావు. దొర పండన్న జన్మి ధర్మ. జన్ని సురేష్ దొర దేవదాసు.

దొర.శాంతి. దొర మంజుల. నందిబడి సుశీల. వీరికి కాంగ్రెస్ పార్టీ . కండువా కప్పి. కాంగ్రెస్ పార్టీలో స్వాగతం పలికిన అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి పాచి పెంట శాంతకుమారి రాబోయే రోజుల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచులు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి మంతనాలు జరుపుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ మెంబర్ పి చిన్న స్వామి అరకు వ్యాలీ మండల అధ్యక్షుడు బోయి మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పాంగి గంగాధర్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రాం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అపోలో ఆసుపత్రి డాక్టర్ అబ్దుల్ ఖాన్‌కు అరుదైన గౌరవం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** ఆరిలోవ హెల్త్ సిటీలో గల అపోలో ఆసుపత్రి డాక్టర్. అబ్దుల్ ఖాన్ కు ఆర్తోపెడిక్స్ లో అరుదైన గౌరవం దక్కింది. ఎ. హెచ్ ఈ. ఆర్ఎఫ్ న్యూఢిల్లీ ప్రొఫెసర్ బిరుదు ప్రధానం చేసింది. డా. అబ్దుల్ ఖాన్ ఆర్థోపెడిక్స్ సీనియర్ వైద్య నిపుణులు. రాష్ట్రంలో అపోలో ఆసుపత్రి కి చెందిన వైద్యులకు ఈ గౌరవం లభించడం ఇదే తొలిసారి. డాక్టర్. ఖాన్ యూ.కే లో ఆర్థోపెడిక్ శిక్షణ పొందారు. నాలుగు పోస్ట్ గ్రాడ్యుయేట్స్ డిగ్రీలను సాధించారు. ఖాన్ ప్రపంచవ్యాప్తంగా జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో మౌఖిక,ఈ పోస్టర్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. బ్రిటీష్ ఆర్థోపెటిక్ అసోసియేషన్ ఏవో 14 జాతీయ, అంతర్జాతీయ వృత్తిపరమైన సంస్థలలో సభ్యుడిగా ఉన్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు విదేశాలలో నైపుణ్యం సాధించి నాలుగు సంవత్సరాల క్రితం భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మొదటిసారిగా 20 అరుదైన శాస్త్ర చికిత్సలు చేశారు. ప్రొఫెసర్ బిరుదు పొందిన డాక్టర్. అబ్దుల్ ఖాన్ కు అపోలో ఆసుపత్రి వైజాగ్ యాజమాన్యం, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

# వెదురుపర్తిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

**కసింకోట, (విశాఖ సమాచారమ్):** వెదురుపర్తి గ్రామంలో పండుగ వాతావరణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్నాథ్‌కు గ్రామస్తులు నీరాజనాలు పలికారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆర్థిక సహకారంతో సొంత ఇల్లు నిర్మించుకోవాలని మంత్రి అమర్నాథ్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి, అవి అందేలా చూడాలని సచివాలయ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. ఇదిలా ఉండగా గడపగడపకు వెళుతున్న మంత్రి అమర్నాథ్ వద్దకు 18 ఏళ్ల ఒక యువతి వచ్చి చాలాకాలంగా ఆమె అనుభవిస్తున్న అనారోగ్య పరిస్థితి గురించి చెబుతూ కన్నీటి పర్యంతమైంది. కాంద్రకోట భార్గవి తన ఏడవ ఎటనే మధుమేహ వ్యాధికి గురి అయింది. అప్పటి నుంచి ఆమె ప్రతిరోజు మందులు వాడవలసిన పరిస్థితి వచ్చింది. ఇందుకోసం నెలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. అనకాపల్లి కళాశాలలో డిగ్రీ చదువుతున్న భార్గవి తండ్రి గత ఏడాది చనిపోయారు. భార్గవిని అనారోగ్య పరిస్థితి ఒకపక్క వేధిస్తూ ఉంటే, మరొక పక్క ఆమె తండ్రి మరణం, వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఆమె భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసింది. భార్గవి కష్టాన్ని విన్న మంత్రి అమర్నాథ్



చలించిపోయారు. భార్గవికి విద్యా దీవెన పథకం కూడా అందలేదని తెలుసుకున్న మంత్రి అక్కడున్న సిబ్బందిని పిలిచి వెంటనే ఆ స్కీమ్ ఆమెకు వర్తించేలా చూడాలని ఆదేశించారు. అలాగే వైద్య ఖర్చులు కూడా అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఇక కసింకోట వాలంటీర్లకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సేవా మిత్ర పురస్కారాలను ప్రకటించింది. వీటిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆయా వాలంటీర్లకు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల బాధలను తెలుసుకుని వాటిని పరిష్కరించే ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కుల, మత, పార్టీ రహితంగా అర్హత ఉన్న వారందరికీ పథకాలు అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తిరిగి ఆదరించాలని కోరారు. అనకాపల్లి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రజాహిత కార్యక్రమాలతో తాము ప్రజలకు మరింత చేరువవుతుంటే సహించలేని ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేస్తున్నాయని అమర్నాథ్ అన్నారు. ప్రజలకు మేలు చేస్తున్నాం కాబట్టే ప్రజా ప్రతినిధులమంతా జనం మధ్య తిరుగుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, అల్లవరపు నాగు, ఆళ్ల జగదీశ్వరరావు, మలసాల కిషోర్, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మార్క్ఫెడ్ ద్వారా 3483.500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోళ్ళు

**విజయనగరం:** ఎ.పి మార్క్ఫెడ్ ద్వారా జిల్లాలో ఇంతవరకు 3483.500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోళ్ళు చేయడం జరిగిందని సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు గిట్టుబాటు ధర 1962 /- కల్పించడం వలన రైతులంతా కొనుగోలు కేంద్రాలకు విచ్చేసి తమ పంటను సంతోషంగా విక్రయిస్తున్నారని అన్నారు. జిల్లాలో రబీ సీజన్ లో 59149 హెక్టార్లలో సాగు చేయగా ఈ విస్తీర్ణంలో సుమరుగ 207109 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని అన్నారు. ఈ క్రమంలో ఆరుగాలం పండించిన పంట దళారి వ్యాపారుల పాలు కాకుండా



అన్నదాతలకు గిట్టుబాటు ధర కూడా అధికంగా ఉండడంతో విక్రయాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. జామి, చీపురుపల్లి, గుర్ల, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి, సంతకవిటి, నెల్లిమర్ల, మెంటాడ , గజపతినగరం మండలాల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయటం జరిగిందని, ఈ జిల్లాలో 160 కేంద్రాలలో648 రైతుల వద్ద నుండి 6.78 కోట్ల విలువ గల మొక్కజొన్న 3483.500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అందులో 281 మంది రైతులకు 3.42 కోట్లను రైతులకు నేరుగా వారి ఖాతాలోకి వేయడం జరిగిందని, రైతులు అమ్మిన పంటకు వారం రోజుల్లో నేరుగా రైతుల ఖాతాలోకి గిట్టుబాటు ధరను చెల్లింపు చేయటం జరుగుతున్నదాని, మిగిలిన రైతులు కూడా వారి పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మంచి ధరను పొందాలని కోరారు.

# నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు కృషి

**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం ప్రాంత విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యానంద్ తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నర్సీపట్నంలో ప్రస్తుతం 16 నుంచి 17 మెగావాట్స్ విద్యుత్ సరఫరా అవుతుంది అన్నారు. నర్సీపట్నం ప్రాంత సమీపంలో గల నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా వినియోగదారులకు వ్యవసాయ



దారులకు వ్యాపారస్తులకు ఎటువంటి విద్యుత్ కోత లేకుండా విద్యుత్ సరఫరా చేయటానికి నిరంతరము కృషి చేస్తున్నామన్నారు. నర్సీపట్నం ప్రాంతంలో విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన తమ దృష్టికి తీసుకువస్తే వాటిపై చర్యలు తీసుకుంటామని ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# వివాదాస్పదంగా సిద్ధరామయ్య కీలక ఉత్తర్వులు

**బెంగళూరు:** కర్ణాటకలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సారథ్యాన్ని వహిస్తోన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇది కాస్త రాజకీయ రంగు పులుముకొంది. ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ విమర్శల దాడి సైతం మొదలు పెట్టింది. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ సిద్ధరామయ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామంటూ హెచ్చరించింది కూడా.

గత ఏడాది జులైలో దక్షిణ కన్నడ జిల్లాలోని సుళ్య తాలుకా బెళ్లారపేటెలో దారుణహత్యకు గురైన భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకుడు ప్రవీణ్ నెట్టారు భార్య నూతన్ కుమారిక బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం ఉద్యోగాన్ని ఇచ్చిన విషయం తెలిసిందే. బెంగళూరులో ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆమెకు గ్రూప్ సీ హోదాతో ఉద్యోగాన్ని కల్పించింది బొమ్మై ప్రభుత్వం. ఇది కాంట్రాక్ట్ ప్రాతిపదికన కల్పించిన ఉద్యోగం.

ఈ ఉద్యోగాన్ని రద్దు చేసింది సిద్ధరామయ్య సర్కార్. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదొక్కటే కాదు- బొమ్మై ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న కొన్ని కీలకమైన కాంట్రాక్ట్ ఉద్యోగాలను తొలగించింది. కర్ణాటకలో ఇకపై కాషాయీకరణ ఉండబోదని, మోరల్ పోలిసింగ్ వ్యవస్థను కూడా రద్దు చేస్తున్నామంటూ ఇదివరకే సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇందులో భాగంగా- బొమ్మై ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని కీలక శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాలను తొలగించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలో ప్రవీణ్ నెట్టారు భార్య నూతన్ కుమారి కూడా ఉద్యోగాన్ని కోల్పోయారు. ఇది కాస్తా రాజకీయ రంగును పులుముకొంది. నూతన్ కుమారిని ప్రభుత్వం అన్యాయం చేసిందని, ఆమెను మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తోంది.

పీఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందంటూ ధ్వజమెత్తింది. ప్రవీణ్ నెట్టారును హత్య చేసిన పీఎఫ్ఐ కార్యకర్తల ఒత్తిడితోనే సిద్ధరామయ్య ఈ నిర్ణయాన్ని తీసుకున్నారంటూ ఆరోపిస్తోంది. దక్షిణ కన్నడ జిల్లాలోని సుళ్య తాలుకా బెళ్లారపేటెకు చెందిన ప్రవీణ్ నెట్టారు గత ఏడాది హత్యకు గురయ్యారు. స్థానికంగా పౌల్ట్రీ షాప్‌ను నిర్వహిస్తోన్న ఆయనను బైక్‌పై వెంటాడి మరీ నరికి చంపారు. అప్పట్లో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

# స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే రిక్రూట్మెంట్ కు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్,2023 కు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 09.05.2023న "కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్, 2023" కోసం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ను విడుదల చేసిందని అన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ట్రిబ్యునల్లు/భారత ప్రభుత్వ కార్యాలయాలు మరియు వివిధ రాజ్యాంగ సంస్థలు/చట్టబద్ధమైన సంస్థలు/లోయర్ డివిజనల్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్లు గ్రూప్ "సి" పోస్టులకు రిక్రూట్మెంట్ కోసం కమిషన్ పోటీ పరీక్షను నిర్వహిస్తుందని తెలిపారు . జిల్లాలో అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు . ss.nic.in/SSCFileServer/PortalManagement/UploadedFiles/notice CHSL 09052023.pdf.లో లభ్యమయ్యే రిక్రూట్మెంట్ నోటిఫికేషన్లో పోస్టుల వివరాలు, వయోపరిమితి, అవసరమైన విద్యార్హత, చెల్లించాల్సిన రుసుము, పరీక్ష విధానం, ఎలా దరఖాస్తు చేయాలి మొదలైన వాటికి సంబంధించిన సమాచారం వివరంగా ఇవ్వబడిందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్లైన్ మోడ్లో మాత్రమే %ంంషి.అఅషి.అఅ% ద్వారా సమర్పించాలని , ఆన్లైన్ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 08.06.2023 మరియు ఆన్లైన్ ఫీజు చెల్లింపు చేయడానికి చివరి తేదీ 10.06.2023 అని తెలిపారు .

దక్షణ ప్రాంతంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆగస్టు, 2023 లో 22 కేంద్రాలు/నగరాల్లో ఈ క్రింది విధంగా జరుగుతుందని పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్లో 10 కేంద్రాలుబీ పుదుచ్చేరిలో 01 కేంద్రం తమిళనాడులో 08 కేంద్రాలు తెలంగాణలో 03 కేంద్రాలలో జరుగునని వివరించారు.

అర్హత గల అభ్యర్థులందరూ ఈ రిక్రూట్మెంట్ కు దరఖాస్తు చేసుకొని, పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** పెదనడుపూరు ఆర్హెచ్ కాలనీ రామాలయం మైదానంలో విండ్ బాల్ క్రికెట్ పోటీలను బిజెపి గాజువాక అసెంబ్లీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఇటీవల రైలు నుండి జారిపడి ప్రమాదవ సాత్తూ మృతి చెందిన ప్రదీప్ కుమార్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్నేహితులు వారి కోచ్ అప్పలరాజు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి వచ్చిన ఆదాయంతో వారి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని అన్నారు . తన వంతుగా సాయంగా మొదటి బహుమతి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లావ్యాప్తంగా 34 టీములు పాల్గొన్నయని గెలుపొందిన వారికి ఆదివారం సాయంత్రం నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రక్తదాతలు రాజు ,పవన్ ,బాలు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలి

**విజయనగరం:** చేపట్టిన అభివృద్ది పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు, వాటికి త్వరగా బిల్లులను ఇప్పించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల బిల్లులన్నీ ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేసేందుకు సిద్దం చేయాలని, అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రాజాం నియోజకవర్గంతోపాటు, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో గ్రామీణ ఉపాధిహామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం క్రింద కన్వర్జెన్సీ నిధులతో పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర



శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పనులు, వ్యవసాయ అనుబంధ శాఖలు, సాగునీటి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులపై చర్చించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, పూర్తి చేసిన పనులకు ఇప్పటికే చాలా వరకు బిల్లులను అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. ఇవి కాకుండా ఇంకా మరికొన్ని విభాగాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా అప్‌లోడ్ చేసేందుకు సిద్దం చేయాలని ఆదేశించారు. ఎంసిసి స్థాయిలో, డిసిసి స్థాయిలో ఎక్కడా బిల్లులు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే, వివిధ శాఖలు సమన్వయంతో, వెంటవెంటనే పరిష్కరించుకొని, యుద్దప్రాతిపదికన 24 గంటల్లో బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్దం చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జెడ్‌పి డిప్యుటీ సిఈఓ కె.రాజ్‌కుమార్, విజయనగరం డ్వామా పిడి జి.ఉమాపరమేశ్వరి, మన్యం జిల్లా డ్వామా పిడి కె.రామచంద్రరావు, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎంవిఆర్ కృష్ణాజీ, రెండు జిల్లాల వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఓలు, ఉపాధిహామీ ఎపిఓలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ 65 వార్డు నుండి చలో రాజమహేంద్రవరం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లా టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వార్డ్ అధ్యక్షులు ఆధ్వర్యంలో చలో పసుపు పండగ మహానాడు కార్యక్రమానికి 65 వార్డ్ నుండి వార్డు ఇంచార్జ్ , వార్డు వైస్ ప్రెసిడెంట్ గాజువాక బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరావు. దారా విజయ్. కోరిబిలి రవణమ్మ. కర్ణం పార్వతి. ముడిసి భవనమ్మ. మల్లేటి లక్ష్మి. ప్రమోదు. వార్డు నాయకులు మహిళలు కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లంటే భయంతో యువతి ఆత్మహత్య



పెళ్లిపై భయం పెంచుకున్న ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి మూసాపేటలోని చైతన్యబస్తీలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు ఆ యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలో ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చైతన్యబస్తీలో ఉండే ఝాన్సీ(25) ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. కొంతకాలంగా ఝాన్సీకి కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే, చుట్టుపక్కల ఇళ్లల్లో భార్యాభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవలు చూసిన ఝాన్సీ పెళ్లిపై భయం, విరక్తి పెంచుకుంది.

తాను పెళ్లి చేసుకోనని కుటుంబసభ్యులకు ఝాన్సీ తెగేసి చెప్పేసింది. అయినా ఆమెకు సంబంధాలు చూడటం ఆపలేదు కుటుంబసభ్యులు. దీంతో తనకు ఇష్టం లేకున్నా పెళ్లి చేస్తారని భయపడిపోయింది. ఈ క్రమంలో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె కుటుంబంతోపాటు స్థానికంగా విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రియుడి ఇంట్లో యువతి ఆత్మహత్య :** ప్రియుడి ఇంట్లో ప్రియురాలు ఉరేసుకున్న ఘటన హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌లో కలకలం రేపింది. ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మెహిదీపట్నంకి చెందిన పూజ చైతన్యపురిలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తోంది. ఈ క్రమంలో జవహర్‌నగర్ యాప్రాల్‌కి చెందిన దయాకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది.

అయితే, పూజ, దయాకర్ ప్రేమ విషయం కాస్తా దయాకర్ తల్లికి తెలియడంతో ఆమె పిలిచి ఇద్దరినీ మందలించింది. అంతటితో ఆగకుండా దయాకర్ తల్లి పూజ తల్లిదండ్రులను కూడా బెదిరించింది. ఈ క్రమంలో దయాకర్ తన ఇంటికి పూజని తీసుకెళ్లాడు. దీంతో దయాకర్‌కి అతని తల్లికి మధ్య గొడవ జరిగింది. వీరిద్దరి గొడవతో తీవ్ర మనస్థాపానికి గురైన పూజ.. ఓ గదిలోకి పరిగెత్తుకుని వెళ్లి గడియ పెట్టుకుంది. ఆ తర్వాత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

# అనకాపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్నాథ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 82వ వార్డు నాలుగో సచివాలయం పరిధిలోని నర్సింగ్ రావు పేటలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. రామచంద్ర థియేటర్ వద్ద నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి అమర్నాథ్ కు వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు అమర్నాథ్కు హారతులు పట్టారు. మంత్రి అమర్నాథ్ ఉత్సాహంగా గడపగడపకు కార్యక్రమంలో పాల్గొని ప్రజలను కలుసుకొని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ హన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రతి సంక్షేమం ప్రజలకు



అందాలనేది లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా 26 లక్షల రూపాయలు జీవీఎంసీ నిధులతో నర్సింగరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజి వీధిలో రహదారులు కాలువల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ జి రామ్మూర్తి, జాజుల రమేష్, పలక సత్యనారాయణ, సకల గోవిందా, కుండల రామకృష్ణ, పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్.
# (నందమూరి తారక రామారావు జయంతి మే 28)

తెలుగువాడి ఆత్మగౌరవం, తెలుగువాడి పౌరుషానికి ప్రతిరూపమైన నందమూరి తారక రామారావు కృష్ణా జిల్లా నిమ్మకూరు లో 28 మే 1923 న జన్మించారు. గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో బి ఏ చదివిన ఎన్టీఆర్ ప్రభుత్వ ఉద్యోగం లో చేరారు. 1949 లో మనదేశం చిత్రంతో తెరంగేట్రం చేసి 1982 వరకు సుమారు 292 చిత్రాల్లో నటించారు. ఆయన నటించిన చివరి చిత్రం శ్రీనాథకవి సార్వభౌముడు (1993). పౌరాణిక పాత్రధారణలో ఎనలేని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. శ్రీ కృష్ణుడు, శ్రీ రాముడు వంటి సాత్విక పాత్రల్ని ఎంత ఔచిత్యంగా పోషించారో దుర్యోధనుడు, రావణ బ్రహ్మ వంటి దుష్ట పాత్రలకూ గౌరవం ఆపాదించి పెట్టిన నటధురీనుడు నందమూరి. పురాణ పాత్రలతో పాటు సాంఘిక పాత్రలైన పోలీస్, జస్టిస్, విప్లవ యోధుడు, సమర యోధుడు వంటి పాత్రలకు తన నటనా కౌశలం తో ప్రాణ ప్రతిష్ట చేసిన ఎన్టీఆర్ దాదాపు 350 చిత్రాలలో నటించారు. 1954 ఫిల్మ్ ఫేర్ అవార్డు స్థాపించిన ఏడాది ఉత్తమ నటుడు పురస్కారాన్ని ఎన్టీఆర్ అందుకున్నారు. ప్రేక్షకుల చేత విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు అనిపించుకున్న ఎన్టీఆర్ కు భారత ప్రభుత్వం 1968 లో 'పద్మశ్రీ' పురస్కారం తో గౌరవించింది. 1942లో బసవతారకం తో వీరి వివాహం జరిగింది. ఆమె 1985 లో క్యాన్సర్ తో చనిపోగా ఆవిడ జ్ఞాపకార్థం ఓ క్యాన్సర్ ఆసుపత్రిని హైదరాబాద్ లో ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ కు ఏడుగురు కొడుకులు, నలుగురు కూతుళ్లు. 1982 మార్చి 29 న తెలుగుదేశం పార్టీని స్థాపించి, తొమ్మిది నెలల కాలంలోనే 1983 మార్చి 9న తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తరువాత 1985, 1994 లలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేశారు. వీరు విద్యారంగంలో సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశారు. ఎంసెట్ రూపకల్పన, మహిళలకు ఆస్తి హక్కు, రెండు రూపాయలకే కిలో బియ్యం, మధ్యాహ్న భోజనం పథకం, మద్య నిషేధం, 'తెలుగు గంగ' ప్రాజెక్టు వీరి ఆలోచనలే. నేషనల్ ఫ్రంట్ పేరుతో కాంగ్రెసేతర పార్టీలను ఒక తాటి పైకి తెచ్చి కేంద్రంలో అధికారం సాధించారు. వీరు తెలుగు వారికి చేసిన సేవలకు గుర్తింపుగా నవంబర్ 1న తెలుగు ఆత్మగౌరవ దినోత్సవంగా జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వీరి పేరుతో 5 లక్షల నగదు బహుమతితో ఒక స్మారక అవార్డును ప్రతి సంవత్సరం ఒక చలనచిత్ర రంగ ప్రముఖుడికి



రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తుంది. వీరు 1996 జనవరి 18 న మరణించారు.

డా. జె.వి.ప్రమోద్ కుమార్
పైడి మెట్ట 9490833108.

## అనకాపల్లిలో సందడి చేసిన విజయ్ ఆంటోనీ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): హాయ్ అనకాపల్లి బాగున్నారా అంటూ తెలుగులో బిచ్చగాడు 2 చిత్ర కథానాయకుడు విజయ్ ఆంటోనీ స్థానిక రామచంద్ర థియేటర్ లో సందడి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19న విడుదలైన బిచ్చగాడు 2 చిత్రం విజయవంతంగా హౌస్ ఫుల్ కలెక్షన్ తో నడుస్తున్న సందర్భంగా ఈ చిత్ర కదానాయకుడు విజయ్ ఆంటోనీ ,సినిమా ఉత్తరాంధ్ర పంపిణీ దారులు పూర్వి పిక్చర్స్ శ్రీనివాస్ చిత్రం ప్రదర్శించబడుతున్న థియేటర్లో సందర్శిస్తున్నారు. చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సందర్భంగా ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేయడానికి రామచంద్ర థియేటర్ కి విచ్చేసారు.ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు విజయ్ ఆంటోనీ తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఈచిత్ర షూటింగ్ లో జరిగిన పెద్ద యాక్సిడెంట్ ఈ సినిమా సాధించిన విజయంతో మరచిపోయానన్నారు. తెలుగు రాష్ట్రాలలో అన్నికేంద్రాల్లో మంచి విజయం సాధించింది ఇప్పటికి 15కోట్లు రెవెన్యూ సాధించిందని..బిచ్చగాడు, బిచ్చగాడు 2ను ఆదరిస్తున్న మీ అభిమానాన్ని జీవితంలో మరిచిపోలేనని బిచ్చగాడు 3 కూడా త్వరలో ప్రారంబించనున్నామని తెలుగుప్రేక్షకులకి భాషా భేదం లేకుండా బాగున్నా ప్రతి చిత్రాన్ని అమోఘంగా ఆదరిస్తారని మీ రుణం ఎప్పటికి తీర్చుకోలేనిదని అన్నారు. 2025 లేదా 26 లో బిచ్చగాడు 3 విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బిచ్చగాడు చిత్రంలోని వంద దేవుల్లే కలిసొచ్చిన అమ్మా నీలాగా చూడలేరమ్మ అంటూ పాట పాడి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోనీతో కరచలనం చేసేందుకు సెల్ఫీలు తీసుకునేందుకు ప్రేక్షకులు ఎగబడ్డారు. చిరునవ్వుతో ఆయన అందరికీ సహకరించారు. ఈ కార్యక్రమంలో థియేటర్ నిర్వాహకులు మళ్ల వెంకట్రావు ,ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు,థియేటర్ మేనేజర్ సాంబశివరావు ,ఫాని,జోగి,ప్రభాష్ ఫాన్స్ జీ.వి.ఎల్.యన్. రాజు తదితరులు పాల్గొన్నారు.

# సంతోషం మన చేతల్లోనే ఉంటుంది




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): సంతోషం మనిషి చేతల్లోనే ఉంటుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శనివారం ఉదయం సైకాలజీ విభాగంలో హ్యూమన్ హ్యాపీనెస్(కాగ్నిటివ్ బిహేవియర్ థెరఫి) అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమస్య ఉత్పన్నం అయినపుడు చికిత్స చేయడం కంటే సమస్య ఎదురవకుండా చూడటం ప్రధానమన్నారు. ఈ దిశగా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులను సిద్ధం చేయాలన్నారు.మానసిక నిపుణులు దీనికి అనవరమైన శిక్షణ కల్పించాలని సూచించారు. తద్వారా మంచి పౌరులను తీర్చిదిద్దడం, మానవ ఆనందం, ఆరోగ్యం సంరక్షించడం సాధ్యపడుతుం దన్నారు. ఇతరులతో పోల్చుకుంటూ మనం మన సంతోషాన్ని కోల్పోతున్నామన్నారు. సంతోషానికి అంతర్గత ప్రేరణే ప్రధానమన్నారు. చిన్న కుటుం బాల తో సంతోషం కొంత తగ్గిపోతోందన్నారు.

సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు మాట్లాడుతూ ఒత్తిడి కారణంగా బి.పి, షుగర్ వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. మంచి మానవ సంబంధాలను కలిగి ఉండటం ఎంతో ప్రధానమన్నారు. వైద్యంతో పాటు కాగ్నిటివ్ బిహేవియర్ థెరపి అందిస్తే మంచి ఫలితాలు సాధ్యపడతాయన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు మానసిక సమస్యలు ఉత్పన్నం అయినపుడు చికిత్సకు వెళ్లడానికి వెనుకంజ వేయడం సరికాదన్నారు. మంచిగా ఆలోచించడం, మంచిగా పనిచేయడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. మానసిక సమస్యలను దూరం చేయడానికి యోగా ఒక సాధనంగా పనిచేస్తుందన్నారు. నిపుణుల ప్రసంగాలు ఎంతో ఉపయుక్తగా నిలుస్తాయన్నారు. ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ సి.రాధాకాంత్ మాట్లాడుతూ నేడు టెలి సైక్రియార్టీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆలోచనలు, మనస్సు, ప్రవర్తన సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామి రెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

## 600 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం



రావికమతం, (విశాఖ సమాచారమ్): మండలంలో విచ్చలవిడిగా ఏరులై పారుతున్న నాటు సారా తయారీ స్థావరాలను గుర్తించి అక్కడ ఉన్న పులుపులను పూర్తిగా ధ్వంసం చేయడం జరుగుతుందని రావి కమతం ఎస్ఐ ఉమామేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో మరుపాక పంచాయతీ రాయవరం గ్రామ పరిసర ప్రాంతంలో 600 లీటర్లు నాటు సారా పులు పులు ఉన్నట్లు గుర్తించి తమ సిబ్బందితో దాడి చేసి పులుపులను పూర్తిగా ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు .ఆ పరిసర ప్రాంతంలో నాటు సారా తయారీదారులు కానీ విక్రయించే వాళ్ళు కానీ ఎవరూ లేకపోవడంతో పులుపులు ధ్వంసం చేసి ఈ పులుపులుఎవరివి అన్న విషయం పైన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రావికమతం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు సిబ్బంది ఎక్కడ రాజీ పడకుండా నాటు సారా తయారీ స్థావరాలను అమ్ముకొందారులను గుర్తించి వారిపై తగు చర్యలు, కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుంది.ఇదిలా ఉండగా మండలంలో ఆర్ .కొత్తూరు, కొమందాన్నిపేట, పి పొన్నవోలు, టి. అర్జా పురం, మర్రివలస, తదితర గ్రామాలలో నాటుసార విచ్చలవిడిగా ఏరులై పారుతుంది .వీరిని చూసి చూడనట్లుగా వ్యవహరిం చడంతో తయారీదారులు విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మద్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలని చెప్తున్నప్పటికీ ఆయా గ్రామాలలో నాటు సారా ఏరులై పారడం విశేషం .ఆయా గ్రామాల పరిధిలో నాటు సారా తయారీదారులు పట్టుబడినప్పటికీ వారిపై కేసులు నమోదు కావడం లేదన్న పలు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వారిపైన ఎటువంటి చర్యలు ఉంటాయో చూడాలి.

## మధురవాడ జోన్‌లో ఆక్రమణల తొలగింపునకై కమిషనర్ ఆదేశాలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మధురవాడ పరిసర ప్రాంతాలలోని ఆక్రమణలను తొలగించాలని జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం అయిన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మధురవాడ ప్రధాన రహదారులు, చంద్రంపాలెం, దుర్గా నగర్, మిథిలాపూర్ కాలనీ, మారికవలస, నగర పాలెం, కొమ్మాది జంక్షన్, బోయపాలెం తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధురవాడ, మిథిలాపూర్ కాలనీ పరిసర ప్రాంతాలలో ఆక్రమణలు అధికంగా ఉన్నాయని వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేసినప్పటికీ వాటి చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించడం లేదని, వాటిని వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ప్రధాన గెడ్డలోని పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వర్షపు నీటికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వీధులలో ప్లాస్టిక్ అధికంగా కనిపిస్తుందని ప్లాస్టిక్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి వాటి నిర్మలనకు కృషి చేయాలని అన్నారు.

## జిల్లాలో 301 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ మంజూరు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జిల్లాలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 301 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డా.ఎ.మల్లిఖార్జున తెలిపారు. కలెక్టర్ ఛాంబర్ లో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ మరియు ఛైర్మన్ డి ఎం ఎ సి,

అధ్యక్షతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందని, అందులో భాగంగా త్వరలో అక్రిడిటేడ్ జర్నలిస్టులకు వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి చర్యలు చేపట్టవలసినదిగా వై.ఎస్.ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జిల్లా కో ఆర్డినేటర్ డా.రాజేష్ ను ఆదేశించారు. ఇప్పటి వరకు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేయని జర్నలిస్టులు ప్రభుత్వ ఉత్తర్వులు 38, తేది 30-3-2023 ననుసరించి ధరఖాస్తు చేసుకొని సదరు ధరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలని అన్నారు.

అంతకుముందు జిల్లాలో నూతనంగా ఏర్పాటు కాబడిన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మెన్ వారికి పుష్పగుచ్ఛం అందజేసారు.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.రాఘవేంద్రరెడ్డి, ఎన్.ఎస్.ఆర్.కె. బాబురావు, ఎమ్ .చిట్టిబాబు, ఎస్.అనురాధ, డి.రాణి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి ఎస్.మోహనలక్ష్మి, వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కె.వి.వి.ఎస్.ఎన్ రాజేష్ , ఆర్.టి.సి డిప్యూటి సి.టి.ఎమ్ జి.సత్యన్నారాయణ, కన్వీనర్ మరియు మెంబరు వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

FLAT for SALE
MVP colony, 1250/ 1160 SFT
2Flats for sale, 2BHK, 2years old,
Floring granite, cupboards, modular kitchen,car parking,lift, generator available. South/North. facing, UDS 40, For details contact
KADAMBARI consultancy services.
PSR Prabhu,
9063801556, 8977901556 (wats up number)


RAMYA GRAND
SERVICE APARTMENT
83097 69408
70323 36399
Address :
Plot No.399, D.No. 10-53,
Near NTR Beach Road
Visalakshi Nagar, Visakhapatnam

STAR Health and Allied Insurance Co. Ltd.
స్టార్ హెల్త్ అండ్ అల్లైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్.
మీకు ఆరోగ్య బీమా ఉందా..?
DO YOU HAVE A HEALTH CARD..?
If not, its Available Here
M.Chandra Mouli
Health Insurance Specialist
8977899939

INDIVIDUAL HOUSE FOR SALE AT MADURAWADA
SOUTH FACING House 6 years old.
255 sqyrds LRS PAID G+1 House with bike and car parking.
150 mtrs from HIGHWAY.
GROUND floor::
2bhk with attached bathrooms
1st floor::
3bhk with attached bathrooms.
NOTE* :: SOUTH WEST ROAD sole HIT kept Ganesh statue.
Cost:: LAKHS Negotiable...
Call:: 8688623665 for more details.

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8186030813

WANTED
DISTRIBUTERS
Fitearly
A food supplement powder to drink with milk to regain Energy. Purely without sugar and Very Very Tasty.
IQ Up-HG
A food supplement for school and college going GIRLS to Improve Memory power, Growth, balance Harmones and keep ENERGYTIC.
IQ Up-HB
An interesting and tasty food supplement for school and college going boys to improve concentration on study, sports, memory, IQ, fitness and keeps always ENERGYTIC.
These Three products are manufactured by shri Akella Subrahmanya Sharma, M.D., Herbindo pvt.ltd. Hyderabad.
* Marketing and Business promotion Support is offered for Distributors.
Minimum Investment :
Rs. 25,000/- Only
Atractive profits and lagre Sales assured.
Contact : 9393949345
S.V.Rao, Visakhapatnam

Looking for
Builder/Developer.
10 Acres land available for sale Near Ghatkesar,
Only for out rate or Half Development half Out rate.
3.5 Cr Per Acre, Inside ORR, Conservative Zone,
Clear Title, Suitable for Villas, Suitable for Layout,
Further details contact me 8147212488

Wanted Independent House
Madhurawada, kommadi, pm palem line lo individual house or villa purchase cheyutaku kavalenu. 200 -250 sq yards lo kavalenu. Budget 2 to 2.5 cr. Compound wall undali Car parking kuda undali. Please confirm me if anybody knows.
7989422831, 9652694110
my contact numbers

Serve Your Kids
High Protein Rich Deit With
A2 COW PANEER
Offers At
10% DISCOUNT

BUY NOW
SWACHH MILLETS
NATURAL & ORGANIC GROCERY MART
MAIN ROAD
VISALAKSHINAGAR , VISAKHAPATNAM
PH : 9966683545 , 9966643545
www.swachhmillets.com

Pressure Pan

3 Litres & 5 Litres
Made of Stainless steel
INDUCTION BASE
Sri Lakshmi metal stores
98 49 11 62 61

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8186030813.